

తిరుమలలో 'తండేల్' బృందం

ఇటీవల విడుదలై విజయాన్నందుకున్న తండేల్ సినిమా బృందం గురువారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుంది. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో దర్శకుడు చందు మొండేటితో పాటూ నిర్మాత అల్లు అరవింద్, బన్నీవాసు, హీరో నాగచైతన్య, హీరోయిన్ సాయిపల్లవి తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయం వెలుపల సినిమా దర్శకుడు చందు మొండేటి మీడియాతో మాట్లాడారు. 'దయచేసి పైరసీలో 'తండేల్' సినిమాను ఎవ్వరు చూడద్దు. పైరసీలో చాలా ఎమోషన్స్ అర్థం కావు. థియేటర్‌కు వచ్చి చూడండి తేడా అర్థమవుతుంది.' అని ప్రేక్షకులకు విజ్ఞప్తి చేశారు. విడుదలకు ముందు నిర్మాత బన్నీవాసు తిరుమలకు వచ్చి అఖండ విజయాన్నివ్వాలని కోరుకున్నారని, స్వామి కరుణించాడని చెప్పారు.అందుకే మొక్కు తీర్చుకునేందుకు వచ్చామన్నారు. - తిరుమల, ఆంధ్రజ్యోతి

ప్రేమ సందడి



ప్రేమంటే హృదయాన్ని పారేసుకోవడం కాదు.. నువ్వు లేనప్పుడు నవ్వుని, నువ్వున్నప్పుడు కాలాన్ని పారేసుకోవడం అంటాడో కవి..రెండు అక్షరాల ఈ పదం రెండు మనసులను దగ్గర చేస్తుంది.. రెండు జీవితాలను ముడివేస్తుంది. యవ్వనంలో అడుగుపెడుతున్న..పెట్టిన వారిని ఈ భావన గిలిగింతలు పెడుతుంది. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనాలు.

6లో

నీరు చెట్టు బిల్లులకు జీఎస్టీ భారం

- పనులు చేసేటప్పుడు లేని ట్యాక్స్ తర్వాత ఖచ్చితం చేసిన వైనం
- 18 శాతం చెల్లించక తప్పని దైన్యం



చిత్తూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మూలిగే నక్కమీద తాటిపండు పడ్డట్లు నీరూచెట్టు బిల్లులకు జీఎస్టీ భారం పడింది. పనులు చేసేటప్పుడు జీఎస్టీ లేకపోవడం, ఆ తర్వాత ఈ విధానం అమలులోకి రావడంతో ఈ కష్టాలు మొదలయ్యాయి. ఏళ్లుగా పెండింగులో ఉన్న బిల్లుల్ని మంజూరు చేసేందుకు అధికారులు ప్రాసెస్ చేస్తుండగా.. 18 శాతం జీఎస్టీనీ కలపాల్సి వస్తోంది. పెండింగ్ బిల్లుల కోసం ఇన్నాళ్లు నిరీక్షించిన కాంట్రాక్టర్లు ఈ జీఎస్టీ భారంపై ఆవేదన చెందుతున్నారు. అధికారులు వర్క్ ఎస్టిమేట్ పెంచి అందులో నుంచి జీఎస్టీని మినహాయిస్తామని చెప్తున్నా.. టెక్నికల్‌గా మాత్రం కాంట్రాక్టరుకు రావాల్సిన నిధుల నుంచే కేటాయించాల్సి వస్తోంది. 2017 జూలై 1 నుంచి జీఎస్టీ అమల్లోకి వచ్చింది. అంతకు ముందు 4 శాతం వ్యాట్‌ను చెల్లించే కాంట్రాక్టర్లు.. అప్పటి నుంచి అగ్రిమెంటు అయిన పనులకు 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి వస్తోంది.

2950 పనులకు రూ.166 కోట్ల బిల్లుల పెండింగు

చెరువులు, చెక్‌డ్యామ్ వంటి జలవనరుల్ని అభివృద్ధి చేసేందుకు 2015-19 మధ్యకాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం 'నీరు-చెట్టు' పథకం కింద పెద్దఎత్తున పనుల్ని చేపట్టింది. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం 'నీరు-చెట్టు' పనులు చేసిన కాంట్రాక్టర్లకు ఉద్దేశపూర్వకంగా బిల్లుల్ని ఆపేసింది.తీరా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పెండింగ్ బిల్లుల్ని మంజూరు చేయమని ఆదేశించింది. ఇలా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 2950 పనులకు సంబంధించిన రూ.166 కోట్ల బిల్లులు మంజూరు కావాల్సి ఉన్నాయి.జలవనరుల శాఖ అధికారులు ప్రస్తుతం బిల్లుల్ని అప్లోడ్ చేస్తున్నారు. ఆయా బిల్లుల్ని ప్రాసెస్ చేసి, జీఎస్టీతో కలిసి అప్లోడ్ చేయడానికి సుమారు మరో మూడు నాలుగు నెలలు పట్టే అవకాశం ఉంది.

ఆర్థికంగా చితికిపోయిన కాంట్రాక్టర్లు

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అప్పటివరకు టీడీపీ అమలు చేసిన అనేక పథకాలు, కార్యక్రమాలు ఆపేసింది. అన్న క్యాంటీన్లు ఎత్తేసింది. టిడ్కో గృహాలను పక్కన పెట్టేసింది. పండుగ కానుకలు, పెళ్లి కానుకలు రద్దు చేసింది.నీరు-చెట్టు పనులన్నీ టీడీపీ సానుభూతిపరులు చేశారనే కారణంతో ఉద్దేశపూర్వకంగా బిల్లుల్ని ఆపేసి విజిలెన్సు విచారణకు ఆదేశించింది. దీంతో నీరూచెట్టు పనులు చేసిన వారంతా ఆర్థికంగా చితికిపోయారు.అప్పులు చేసి పనులు చేపట్టిన వారంతా సుమారు ఏడేళ్ల పాటు వడ్డీలు కట్టుకోవాల్సి వచ్చింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సుమారు 250 మంది మాత్రం పెండింగు బిల్లుల కోసం కోర్టును ఆశ్రయించగా.. వారిలో కొందరికి తప్పనిసరి పరిస్థితుల్లో వైసీపీ ప్రభుత్వం బిల్లుల్ని చెల్లించింది.

రూ.1.88 లక్షల జీఎస్టీ భారం..

సోమల మండలంలో చెక్‌డ్యామ్ మరమ్మతుకు 2017లో జలవనరుల శాఖ అధికారులు రూ.22 లక్షలతో టెండర్ పిలిచారు. అదే మండలానికి చెందిన టీడీపీ నేత ఆ పనిని తక్కువ ధరకు రూ.17.66 లక్షలకు టెండర్‌ను దక్కించుకున్నారు. 2017లోనే పనులు పూర్తి చేశారు. జీఎస్టీ అమలులోకి రాకముందే కొంత మేర బిల్లులు వచ్చినా.. సుమారు రూ.10 లక్షలకుపైగా పెండింగు పడింది. ఇప్పుడు బిల్లుల మంజూరుకు ప్రక్రియ ప్రారంభమైంది. పనులు చేసినప్పుడు లేని జీఎస్టీ విధానం ఇప్పుడు ఉండడంతో.. 18 శాతం అంటే రూ.1.88 లక్షలు కేటాయించాల్సి వస్తోంది. సుమారు 8 ఏళ్లుగా అతను బిల్లుల కోసం వేచి ఉండగా.. ఇప్పుడేమో రావాల్సిన బిల్లులో జీఎస్టీ తప్పనిసరి అంటున్నారు.

పెండింగ్ బిల్లు కంటే జీఎస్టీనే అధికం

ఎస్ఆర్‌పురం మండలంలో ఓ టీడీపీ సానుభూతిపరుడు 2017లో రూ.10 లక్షల విలువ చేసే నీరు చెట్టు పనులు చేశారు. అప్పట్లోనే రూ.9 లక్షల వరకు బిల్లులు వచ్చేశాయి. మిగిలిన రూ.లక్ష పెండింగులో ఉండగా.. ఇప్పుడు బిల్లు పెట్టాలంటే ఇదివరకే చెల్లించిన రూ.9 లక్షలకు కూడా జీఎస్టీ కలుపుకోవాల్సి వస్తోంది. వచ్చే పెండింగ్ బిల్లు కంటే చెల్లించాల్సిన జీఎస్టీ అధికంగా కావడంతో ఆ కాంట్రాక్టరు రూ.లక్ష పెండింగు బిల్లును వదులుకునేందుకు సిద్ధపడ్డారు.

జల్లీ ఫ్యాక్టరీపై విచారణ జరిపించండి



కుప్పం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలంలో అక్రమంగా నడుస్తున్న గ్రానైట్ క్వారీలు, జల్లీ ఫ్యాక్టరీలపై విచారణ జరిపించాలని మండల టీడీపీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ గురువారం కలెక్టర్ సుమిత్ కుమార్‌కు విన్నవించారు. మండల సచివాలయంలో గురువారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ఆయన కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మిట్టపల్లె పంచాయతీ ఆవులనత్తం సమీపంలో నడుస్తున్న జల్లీ ఫ్యాక్టరీ వల్ల పంట పొలాలు కలుషితం కావడమే కాకుండా, పాడి పశువులు చనిపోతాయన్నారు. ఫ్యాక్టరీనుంచి వస్తున్న ప్రకంపనలు, పేలుళ్ల వల్ల సమీప గ్రామాలలోని ఇళ్లు పగుళ్లు ఏర్పడి కూలిపోయి ప్రజలకు, రైతులకు తీవ్ర నష్టం జరుగుతున్నదని చెప్పారు. ఇక్కడి జల్లీ ఫ్యాక్టరీని మూసివేయాలంటూ 39 రోజులుగా సమీప గ్రామాల ప్రజలు, రైతులు నిరసన వ్యక్తం చేస్తున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. జల్లీ ఫ్యాక్టరీనీ మూసివేయాలని వారంతా డిమాండ్ చేస్తున్నారన్నారు. ఈ ఫ్యాక్టరీపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రేమ్ కుమార్ వినతిపై స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.కాగా చాలాకాలం తర్వాత కుప్పంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై అర్జీలు వెల్లువెత్తాయి.

వీరప్పల్లి సర్పంచ్ దంపతులపై కేసు

- చేయని తప్పునకు ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన

పెద్దపంజాణి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి సొంత పంచాయతీ వీరప్పల్లి సర్పంచి పార్వతమ్మ, ఆమె భర్త వెంకటప్పలపై స్థానిక వైసీపీ నేత ఫిర్యాదుతో పెద్దపంజాణి పోలీసులు కేసు నమోదు చేశారు.అయితే చేయని తప్పునకు తమను ఇబ్బంది పెడుతున్నారని సర్పంచి దంపతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.2022లో పెద్దపంజాణి మండలం వీరప్పల్లి పంచాయతీ సుద్దగుండ్లపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మురిక్కాలువ మంజూరైంది. గ్రామానికి చెందిన వైసీపీ నేత గట్టప్ప తన సొంత స్థలం పక్కన తారు రోడ్డును ఆనుకుని డ్రెయిన్ నిర్మాణం చేపట్టగా, గ్రామస్థులు నిలిపేశారు. తారు రోడ్డుకు నాలుగు అడుగులు వదిలి నిర్మించాలని తహసీల్దార్, ఎంపీడీవో, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ తదితర అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీ కూడా ఆ పనిని నిలుపుదల చేయాలని తీర్మానం చేసింది. కొన్నాళ్ల తర్వాత వైసీపీ నేత గట్టప్ప తారు రోడ్డును ఆనుకుని డ్రెయిన్ నిర్మించారు. కొన్నాళ్లకు అది ఛిద్రమైంది. కానీ, సుద్దగుండ్లపల్లెకు చెందిన జేసీబీ డ్రైవర్ కృష్ణమూర్తి మురిక్కాలువ పాడయ్యేందుకు కారకుడని అతనిపై దాడి చేసి గాయపరిచారు. దీనిపై పోలీసులకు కృష్ణమూర్తి ఫిర్యాదు చేయగా గట్టప్పపై కేసులు నమోదు చేశారు.ఇది జరిగిన కొన్నాళ్లకు సర్పంచి పార్వతమ్మ, ఆమె భర్త వెంకటప్ప డ్రెయిన్ కూల్చేశారని గట్టప్ప హైకోర్టును ఆశ్రయించారు. దానికి సంబంధించిన పూర్తి వివరాలను పెద్దపంజాణి ఎస్ఐకి అందించినా, పోలీసులు హైకోర్టుకు ఆ వివరాలను సకాలంలో అందించలేదు. దీంతో హైకోర్టు సర్పంచి దంపతులపై కేసు నమోదు చేయాలని ఆదేశించడంతో ఇద్దరిపై పెద్దపంజాణి స్టేషన్‌లో కేసు నమోదైంది.చేయని తప్పునకు తమపై కేసు నమోదు చేశారని సర్పంచి దంపతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'కడా'కు రూ.50 కోట్లు విడుదల

కుప్పం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(కడా)కి వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం ప్రభుత్వం రూ.50 కోట్లు విడుదల చేసింది.ప్రైవేట్ కన్సల్టెన్సీ సేవలు, కడా కార్యాలయం ఏర్పాటుతో పాటు 9 అభివృద్ధి పనుల అమలుకోసం ప్రభుత్వం రూ.92.20 కోట్లను మంజూరు చేస్తూ ఫిబ్రవరి 10వ తేదీనే ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో మొదటి విడతగా రూ.42.20 కోట్ల నిధులు 2024-2025 బడ్జెట్టులో ఇప్పటికే విడుదల అయ్యాయి. మిగిలిన రూ.50 కోట్ల నిధులను పరిపాలనా అనుమతితో సహా విడుదల చేస్తూ ఇప్పుడు ప్రత్యేకంగా జీవో జారీ అయింది.

10 టన్నుల రేషన్ బియ్యం సీజ్



చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పేదప్రజలకు పంపిణీ చేసేందుకు కేటాయించిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా గోదాములో నిల్వచేస్తున్నట్లు ఫిర్యాదు రావడంతో పౌరసరఫరాల శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్వో శంకరన్ కథనం మేరకు...చిత్తూరు సమీపంలోని మురకంబట్టు బైపాస్‌లో బద్రీనాథ్ అనే వ్యక్తికి చెందిన గోదాములో రేషన్ బియ్యాన్ని నిల్వచేస్తున్నట్లు డీఎస్వో కార్యాలయానికి ఫోన్ ద్వారా సమాచారమందింది. దీంతో డీఎస్వో శంకరన్ ఓ బృందాన్ని ఏర్పాటు చేసి అక్రమంగా నిల్వచేస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకోవాలని ఆదేశించారు.డీటీలు శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, పయని, చిత్తూరు అర్బన్ ఆర్ఐ సతీష్ తదితరులతో కూడిన బృందం గోదాము వద్దకు వెళ్లారు. అదేసమయంలో ఆటోలో నుంచి గోదాములోకి తరలిస్తున్న పది టన్నుల బియ్యాన్ని సీజ్ చేశారు. ఇది తెలిసిన వెంటనే గోడౌన్ యజమాని బద్రీనాథ్, ఆటోడ్రైవరు పరారయ్యారు. బద్రీనాథ్‌పై 6ఏ కేసును నమోదు చేసినట్లు డీఎస్వో తెలిపారు.

భర్తను హత్య చేసి.... ఆపై కనపడలేదంటూ ఫిర్యాదు చేసి



మృతుడు బి.రెడ్డెప్ప (ఫైల్ ఫోటో)

- రెండేళ్లనాటి కేసును ఛేదించిన పోలీసులు



దోషులను అరెస్టు చేసిన సీఐ కృష్ణమోహన్, ఎస్ఐ నరసింహులు

ఐరాల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) :రెండేళ్ల క్రితం భర్తను హత్య చేసిన మహిళతో పాటు ఆమె ప్రియుడిని గురువారం పోలీసులు అరెస్టు చేశారు. పూతలపట్టు సీఐ కృష్ణమోహన్ కథనం మేరకు....2023వ సంవత్సరం జనవరి7న ఐరాల పంచాయతీ నయనంపల్లెకు చెందిన బి.కామేశ్వరి తన భర్త బి.రెడ్డెప్ప(41) కన్పించడం లేదంటూ ఐరాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులకు దర్యాప్తులో బి.కామేశ్వరికి కంచవారిఇండ్లుకు చెందిన కె.సుధాకర్‌తో సంబంధం ఉన్నట్లు తెలిసింది.దీంతో పోలీసులు ఈ కోణంలో దర్యాప్తును ముమ్మరం చేశారు.ఇద్దరినీ అరెస్టు చేసి విచారించగా నేరం ఒప్పుకున్నారు.తమ సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడని భావించిన ఆమె ప్రియుడితో కలసి భర్తను చంపాలని పథకం రచించింది.2022వ సంవత్సరం నవంబరు 17వ తేదీన రాత్రి ఇద్దరూ కలసి ఇంటి వద్ద వున్న రెడ్డెప్ప తలపై బండ రాయితో మోది హత్య చేశారు. శవాన్ని టార్పాలిన్ పట్టలో మూటకట్టి గ్రామానికి కిలోమీటర్ దూరంలో ఉన్న వ్యవసాయ బావిలో పడవేశారు. టార్పాలిన్ పట్టలో బండరాళ్లు వేసి, అలాగే పట్ట వెలుపల నాలుగు వైపులా పెద్ద రాళ్లతో కట్టి బావిలో వేయడంతో ఈ విషయం బయటికి తెలియ లేదు.రెండు నెలల తరువాత ఏమీ ఎరగనట్లు తన భర్త కన్పించడం లేదంటూ కామేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణ అనంతరం నేరాన్ని ఒప్పుకున్న కామేశ్వరి,సుధాకర్ తాము రెడ్డెప్ప శవాన్ని ఏ బావిలో పడవేశారో పోలీసులకు చూపించారు. సీఐతో కలసి ఐరాల ఎస్ఐ నరసింహులు గురువారం ఆ బావి వద్దకు వెళ్లి రెడ్డెప్ప అస్తిపంజరాన్ని బయటకు తీశారు.దాన్ని చూసి రెడ్డెప్ప బంధువులు కన్నీరుమున్నీరయ్యారు.

సంక్షేమ హాస్టళ్లకు భద్రత కరువు!

- కానరాని సీసీ కెమెరాలు
- కన్నెత్తిచూడని పోలీసులు

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ హాస్టళ్లకు భద్రత కరువైంది. పేద పిల్లలకు అవసరమైన దుస్తులతో పాటు పాఠ్యపుస్తకాలు,మూడుపూటలా భోజన వసతి సమకూరుస్తున్నప్పటికీ భద్రతను పట్టించుకోవాల్సిన సంక్షేమశాఖలు, పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో సాంఘిక సంక్షేమశాఖ పరిధిలోని 57 ప్రీమెట్రిక్, పోస్టుమెట్రిక్ హాస్టళ్లలో 2500 మంది విద్యార్థినీవిద్యార్థులు వసతి పొందుతున్నారు. అలాగే బీసీ సంక్షేమశాఖ పరిధిలో 38 ప్రీమెట్రిక్, పోస్టుమెట్రిక్ హాస్టళ్లలో సుమారు మూడువేలమంది విద్యార్థులు ఉంటున్నారు.వీరి సంరక్షణ బాధ్యతలతో పాటు బాగోగులను సంక్షేమాధికారులే చూడాల్సి ఉంది.

ఏ ఒక్క హాస్టల్‌కు సీసీ కెమెరా లేదు

జిల్లాలో సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో సుమారు 5500 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. పాఠశాలలు, కళాశాలలు ముగించుకుని హాస్టళ్లకు చేరుకున్న తరువాత విద్యార్థులకు బయోమెట్రిక్ ద్వారా అటెండెన్స్ తీసుకుంటారు. అనంతరం బయటికి వెళ్లే విద్యార్థినీవిద్యార్థుల కోసం మూమెంట్ రిజిస్టర్‌ను నిర్వహించాల్సి ఉంది.అయితే జిల్లాలో ఏ ఒక్క హాస్టల్‌లో కూడా మూమెంట్ రిజిస్టర్‌ను నిర్వహించడం లేదు.విద్యార్థుల భద్రతకోసం ప్రతి హాస్టల్లో సీసీ కెమెరాలను ఏర్పాటుచేయాలని ప్రతిపాదనలున్నప్పటికీ ... ఆ దిశగా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టడం లేదు.ఏటా విడుదలయ్యే బడ్జెట్‌ను హాస్టళ్ళకు అవసరమైన వాటికి కాకుండా వార్డెన్ల జేబులు నింపే పనులకే ఎక్కువ వాడుతున్నారనే విమర్శలు చాలాకాలంగా ఉన్నాయి. ఆయా శాఖల ప్రధాన కార్యాలయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్న అధికారులు వారి పర్యవేక్షణలో ఉన్న విద్యార్థుల భద్రతను మాత్రం గాలికొదిలేశారన్న అపప్రథను మూటగట్టుకుంటున్నారు.

విద్యార్థులు తప్పిపోతున్నా..

చిత్తూరు నగరంలో సోమవారం రాత్రి సావిత్రమ్మ డిగ్రీ కళాశాల వెనుకవైపున ఉన్న హాస్టల్ నుంచి డిగ్రీ చదువుతున్న విద్యార్థిని అదృశ్యమైంది. ఆ విద్యార్థిని ఎక్కడకు వెళ్లిందనే విషయాన్ని ఇంతవరకు సంక్షేమాధికారులు గుర్తించకపోగా పోలీసులకు సైతం ఫిర్యాదు చేయలేదు. అలాగే ఆరునెలల క్రితం లిటిల్‌ఫ్లవర్ పాఠశాల ఎదురుగా ఉన్న సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహంలో ఉన్న విద్యార్థులు దొంగతనం చేశారని ఓ షెడ్డు యజమాని వారిని చితకబాదాడు. అప్పట్లో కూడా సంక్షేమాధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. ఈ సంఘటనకు భయపడి ఏకంగా మూడునెలలు సెలవు పెట్టి వెళ్ళిపోయిన ఆ హాస్టల్ వార్డెన్ తాజాగా విధుల్లో చేరారు.జిల్లాలో అప్పుడప్పుడూ విద్యార్థులు తప్పిపోతున్నప్పటికీ సంక్షేమాధికారులు పట్టించుకోవడం లేదు.

పోలీసుల పర్యవేక్షణ శూన్యం

ఎస్సీ, బీసీ, గిరిజన, మైనార్టీ వసతిగృహాల్లోని విద్యార్థులపై పోలీసుల పర్యవేక్షణ ఉండాలి. మండలకేంద్రాల్లో హాస్టళ్లున్నప్పటికీ జనావాసాలకు దూరంగా ఉండడంతో విద్యార్థులు రాత్రివేళల్లో కొంత ఆందోళనకు గురవుతారు.కొన్నిచోట్ల అయితే ఆకతాయిలు మద్యం మత్తులో హాస్టళ్ళలో చొరబడి హంగామా చేసిన సంఘటనలున్నాయి. పోలీసులు రోజూ రాత్రి 12గంటల సమయంలో హాస్టళ్ళకు వెళ్లి అక్కడున్న మూమెంట్ రిజిస్టర్‌లో సంతకం చేసి రావాల్సి ఉంది. అయితే పోలీసులు హాస్టళ్ళకు వెళ్లి సంతకం చేయడంతో పాటుగా వారికి పోలీసులు రక్షణగా ఉన్నామనే భరోసాను ఇవ్వడం లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థుల రక్షణకు చర్యలు చేపట్టాల్సిన అవసరం వుంది.

పీవీకేఎన్‌లో న్యాక్ బృందం



పవర్ పాయింట్ ప్రజెంటేషన్ వీక్షిస్తున్న న్యాక్ బృందం

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యా సంస్థల పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించడం ద్వారా అంచనా వేసి గుర్తింపు ఇచ్చే ప్రభుత్వ సంస్థ నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) కమిటీ గురువారం చిత్తూరులోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించింది.కమిటీ సభ్యులైన అసోం డాన్‌బాస్కో యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జానీ జోస్, కర్ణాటక సెయింట్ జోసఫ్ కాలేజ్ అటానమస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పాల్ న్యూమెన్, గోవా యూనివర్శిటీ పూర్వ ప్రొఫెసర్ డాక్టర్ సుదర్శన్ రెండు రోజుల పాటు కళాశాల స్థితిగతులపై అధ్యయనం చేయనున్నారు. పీవీకేఎన్ డిగ్రీ కళాశాలకు ప్రస్తుతం న్యాక్ ఏ గ్రేడ్ ఉన్న విషయం తెలిసిందే. కళాశాల ప్రాంగణం, కోర్సులు, బోధన, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, పరీక్షల నిర్వహణ, ల్యాబ్‌లు, కళాశాలకు వస్తున్న నిధులు, వాటి వ్యయం, రికార్డుల పరిశీలన తదితర విషయాలను రెండు రోజుల పాటు కమిటీ అధ్యయనం చేయనుంది. ఆపై నివేదికను భారత ఉన్నత విద్యా సంస్థకు నివేదించనున్నారు. దీనిపై క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం కళాశాలకు గ్రేడ్ పెంచాలా, లేదా అనే దానిపై నిర్ణయం తీసుకోనున్నారు. న్యాక్ బృందం సభ్యులకు ప్రిన్సిపాల్ జీవనజ్యోతితో పాటు అధ్యాపకులు, విద్యార్థులు సాదర స్వాగతం పలికారు. అనంతరం కళాశాలలో పలు అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా న్యాక్ బృందానికి ఆయా సబ్జెక్టుల వారీగా అధ్యాపకులు వివరించారు.

గుంపులుగా వెళ్లండి

నడకమార్గంలో ఫారెస్ట్ సిబ్బంది



● చిరుత కలకలం నేపథ్యంలో భక్తులను అప్రమత్తం చేసిన అధికారులు


తిరుమల, ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): అలిపిరి నడక మార్గంలోని ఏడోమైలు ముగ్గు బావి వద్ద గురువారం రాత్రి చిరుత కనిపించిందన్న భక్తుల కేకలతో అధికారులు అప్రమత్తమయ్యారు. విజిలెన్స్, ఫారెస్ట్ అధికారులు అక్కడికి చేరుకున్నారు. చిరుత అడవిలోకి వెళ్లిపోయిందని నిర్ధారించుకున్నాక భక్తులను గుంపులుగుంపులుగా అనుమతించారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు భద్రతను కట్టుదిట్టం చేశారు.

ముక్కంటి ఆలయ హుండీ ఆదాయం రూ.2.04కోట్లు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం హుండీ లెక్కింపు జరిగింది. స్వామి అమ్మవార్ల గర్భాలయాల వద్ద ప్రధాన హుండీలతో పాటూ పరివార దేవతల హుండీలను గురువారం ఉదయం ఆలయంలో లెక్కించారు. మొత్తం 40 రోజులకు రూ.2.04కోట్లు ఆదాయం వచ్చినట్టు అధికారులు చెప్పారు. డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 16 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు,నారాయణగిరిలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

మంగళవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.37 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,270

తలనీలాలు సమర్పించినవారు: 22,175

మార్కెట్‌లో ప్రేమ సందడి





గుప్పెడంత గుండెలోని కొండంత ప్రేమను వ్యక్తం చేయాలి. మనసులో ప్రేమ గిలిగింతలు పెడుతున్న అమ్మాయి హృదయాన్ని గెల్చుకోవాలి. ఇందుకోసం అందమైన నాలుగు మాటలు, పదాలను పోగేసి కవిత చెబితే సరిపోతుందా..చాలదంటున్నారు ఈతరం ప్రేమికులు.. గుర్తుంచుకునేలా శుక్రవారం వేలెంటైన్స్ డేను సెలబ్రేట్ చేసుకోవాలనుకుంటున్నారు. వీరి మనసులోని భావాలను వ్యాపారంగా మార్చుకోడానికి మార్కెట్లు సిద్ధమయ్యాయి. ఇప్పటికే తిరుపతి నగరంలోని పలు గిఫ్ట్,ఫ్యాన్సీ షాపుల్లో ప్రేమికుల సందడి కనిపిస్తోంది. రకరకాల కేకులు,పుష్పాలు, బహుమతులు కొనుగోలుకు లవర్స్ సిద్ధమవుతున్నారు.

వారిది ప్రేమైక కుటుంబం



అపరంజి.. సుజాత



ప్రేమ పెళ్లిళ్లు చేసుకున్న అపరంజి సంతానం

ప్రేమంటే గుర్తుకు రావడం కాదు..జీవితాంతం గుర్తుంచుకోవడం అంటారు. పుత్తూరు పట్టణంలో అపరంజి కుటుంబాన్ని చూస్తే ఈ మాటలు అక్షరసత్యాలు అనిపించకమానదు. చాలామంది ప్రేమలు ప్రేమించడం అనే గడప దగ్గరే ఆగిపోతాయి. కానీ అపరంజి అలా కాదు. మనసిచ్చిన వారితోనే మనువు అని బలంగా విశ్వసించారు. ఒకసారి ఆయన ప్రేమ వివరాలు తెలుసుకుంటే.. దళిత సామాజికవర్గానికి చెందిన అపరంజి పేదరికంతో అష్టకష్టాలు పడ్డారు. డిగ్రీ పూర్తి చేశారు. ముద్దుకృష్ణమనాయుడు సిఫార్సుతో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చిరుద్యోగిగా చేరారు. అంచలంచెలుగా ఎదిగి హిందీ అధ్యాపకుడు స్థాయికి చేరుకున్నారు. జూనియర్ కళాశాలలో పని చేస్తున్న సమయంలో అక్కడ అగ్రవర్ణానికి చెందిన సుజాతతో పరిచయమేర్పడింది. అది ప్రేమగా మారింది. కులాలు మతాలు అడ్డువచ్చినా కాదని తోసిపుచ్చారు. ప్రేమపక్షానే నిలిచారు. పెద్దల నుంచి అభ్యంతరాలు ఎదురయ్యాయి. కానీ తాము పెళ్లితో ఒక్కటవుతామని పోలీసులు, పెద్దలకు తెగేసి చెప్పారు. ధైర్యంగా తిరుమలలో పెళ్లిపీటలెక్కారు. సమాజ ఆటు పోట్లకు వెరవకుండా కలిసి జీవితం సాగించారు. సుజాత ముగ్గురు పిల్లలు పుట్టిన తర్వాత భర్తకు చేదోడువాదోడుగా ఉండాలని సంకల్పించింది. టీచర్ ట్రైనింగ్ పూర్తి చేసింది. ప్రభుత్వ టీచరుగా ఎంపికైంది. పిల్లలు సాయిలక్ష్మి, దివ్యశ్రీ, సాయిప్రకాష్‌లను ఈదంపతులు బాగా చదివించారు. తాము అనుభవించిన ఇబ్బంది మరొకరికి ఎదురుకాకూడదని పెళ్లి విషయంలో పిల్లలకు స్వేచ్ఛనిచ్చారు. ముగ్గురు పిల్లలు సహోద్యోగులను ప్రేమించారు. దీంతో వీరంతా ప్రేమ వివాహాలే చేసుకున్నారు. వీరి కుటుంబంలో రెండోతరం ప్రేమ వారసులుగా నిలిచారు. - పుత్తూరు, ఆంధ్రజ్యోతి

'ప్రేమ'యుద్ధంలో గెలిచారు





కుమార్తెలు యక్షకుమారి, లిఖితలతో పురుషోత్తం, కృష్ణకుమారి దంపతులు

పురుషోత్తం, కృష్ణకుమారిల్లో చిన్నప్పుడు చిగురించిన స్నేహం ఎదిగేకొద్దీ ప్రేమ పుష్పమై వికసించింది. పెద్దయ్యాక అయినవారు కాదన్నా ఒప్పించి ఒక్కటయ్యారు. నాయుడుపేటకు చెందిన పురుషోత్తం, కృష్ణకుమారీల మధ్య ఏడో తరగతి చదువుతున్నప్పుడు స్నేహం ఏర్పడింది. తరువాత ఇంటర్మీడియట్‌లో వేర్వేరు గ్రూపులు తీసుకున్నా కలిసే చదివారు. డిగ్రీ కళాశాలలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. 14 సంవత్సరాల వారి స్నేహం ప్రేమగా మారింది. 2002 సెప్టెంబరులో పురుషోత్తం ఇండియన్ ఆర్మీలో సోల్జర్‌గా ఎంపికయ్యాడు. ఈనేపథ్యంలో వీరి ప్రేమ వ్యవహారం ఇరు కుటుంబాలకు తెలిసింది. కృష్ణవేణి కుటుంబసభ్యులు అభ్యంతరం తెలియజేశారు. అయినప్పటికీ కృష్ణవేణి రెండేళ్లపాటు పెళ్లిచూపులు వాయిదావేస్తూ వచ్చింది. పురుషోత్తం వచ్చి తన మెడలో మూడుముడులు వేస్తాడని విశ్వసించింది. మిలటరీ ట్రైనింగ్ పూర్తి చేసుకున్నాక స్వస్థలానికి వచ్చారు. కృష్ణకుమారి తల్లిదండ్రులను, కుటుంబసభ్యులను ఒప్పించడంలో సఫలమయ్యారు. 2004 మే9న కృష్ణకుమారిని పెళ్లి చేసుకున్నారు. 2018 ఆగస్టు 31నపురుషోత్తం ఆర్మీలో హవల్దార్ హోదాలో రిటైరయ్యారు. ప్రస్తుతం ఆయన గ్రీన్‌టెక్ పరిశ్రమలో పనిచేస్తున్నారు.

- నాయుడుపేట, ఆంధ్రజ్యోతి

ప్రాణం తీసిన బనియన్

● తీసే క్రమంలో మెడకు బిగుసుకుని బాలుడి మృతి



తడ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఒంటిపై ఉన్న బనియన్‌ను తీసే క్రమంలో అది మెడకు బిగుసుకుపోవడంతో ఓ బాలుడు మృతిచెందాడు. తడ మండలం రామాపురం పంచాయతీ వెంకటాద్రి పాళెం గ్రామానికి చెందిన శరణేష్ (13) గురువారం ఇంటివద్ద స్నానం చేసేందుకు వెళ్లాడు. ఆ సమయంలో బనియన్‌ను తీస్తుండగా అది ఓ పక్క మెడకు, మరోపక్క దుస్తులను తగిలించే స్టాండ్‌కు తగులుకుంది. ఊపిరి అందక అక్కడికక్కడే మృతిచెందాడు. స్నానానికి వెళ్లిన బాలుడు అరగంట అయినా రాకపోయే సరికి కుటుంబ సభ్యులు తలుపులు బద్దలుకొట్టి చూడగా చనిపోయి ఉన్నాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పనిచేయని సర్వర్లతో ఆగిన రిజిస్ట్రేషన్లు



మూసి ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

కోట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : కోట సబ్ రిజిస్ట్రార్ కార్యాల యంలో గురువారం సర్వర్లు పనిచేయకపోవడంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఆగిపోయింది. ఉదయం నుంచి కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాలకు చెందిన రైతులు, వ్యాపారస్తులు భూములు, ఇల్లు రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు వచ్చారు. సర్వర్లు మొరాయించడంతో సిబ్బంది చేతులు ఎత్తేశారు. దీంతో చేసేదిలేక ఆయా మండలాల రైతులు, వ్యాపారులు నిరాశతో వెనుదిరిగారు.

పరిశ్రమల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం

తిరుపతి (కలెక్టరేట్), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మీనాక్షి కంపెనీ (వేదాంత పవర్), సింహపురి జిందాల్ కంపెనీ, నవయుగ కంపెనీ ప్రతినిధులతో కలెక్టర్ వెంకటేశ్వర్ గురువారం సమన్వయ సమావేశం నిర్వహించారు. సంబంధిత మ్యాప్‌లను పరిశీలించారు. ఎన్‌హెచ్‌ఏఐ నెల్లూరు వారితో పలు అంశాలపై చర్చించారు. జిల్లాలో పెట్టుబడులు పెట్టడానికి ఎంతో అనువైందని, తమ వంతు సహకారం అందిస్తామని పరిశ్రమలు ప్రతినిధులకు కలెక్టర్ హామీ ఇచ్చారు. ఏపీఐఐసీ జెడ్‌ఎం నెల్లూరు శివకుమార్ పాల్గొన్నారు.

16న మంత్రి లోకేశ్ రాక

తిరుపతి (కలెక్టరేట్), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ఈనెల 16 ఉదయం 9.20 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారు రోడ్డు మార్గాన నెల్లూరు వెళ్లి మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు మనవడి వివాహానికి హాజరవుతారు. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు మళ్లీ విమానాశ్రయానికి చేరుకుని హైదరాబాదు వెళ్లనున్నారు.

జనసేన నేత కిరణ్‌రాయల్‌పై చీటింగ్ కేసు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) తిరుపతి నగర జనసేన ఇన్‌చార్జి కిరణ్‌రాయల్‌పై యూనివర్శిటీ పోలీసులు గురువారం రాత్రి చీటింగ్ కేసు నమోదు చేశారు. సీఐ రామయ్య కథనం మేరకు.. ఇటీవల కిరణ్‌పై వివిధ రకాల ఆరోపణలు, విమర్శలు చేసిన లక్ష్మీరెడ్డి రెండు రోజుల క్రితం కిరణ్‌రాయల్ ఇచ్చిన డబ్బు అడిగినందుకు తనను చంపుతానని బెదిరిస్తున్నాడని, మోసం చేసి అవమానకరంగా ప్రవర్తించాడని ఎస్వీయూ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ రామయ్య సెక్షన్ 420, 417, 506తో పాటు బీఎన్‌ఎస్ యాక్టు కింద కేసు నమోదు చేశారు.

వ్యవసాయ కళాశాలకు మళ్లీ బాంబు బెదిరింపు మెయిల్

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): తిరుపతి వ్యవసాయ కళాశాలకు గురువారం మళ్లీ బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. సమాచారం అందుకున్న తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు ఆధ్వర్యంలో డాగ్, బాంబు స్క్వాడ్ సిబ్బంది కళాశాలలో ముమ్మరంగా గాలించారు. ఎక్కడా బాంబులకు సంబంధించిన ఆనవాళ్లు లభించకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఐఐడీటీకి రూ.1.2 కోట్లు మంజూరు

తిరుపతి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజిటల్ టెక్నాలజీస్ (ఐఐడీటీ)కు రాష్ట్ర ప్రభుత్వం రూ.1.20 కోట్లు మంజూరు చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ పథకాలు అమలు చేసేందుకు అదర్ గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ కింద ఈ నిధులను విడుదల చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

వెటర్నరీ వర్సిటీ స్టాండింగ్ కౌన్సిల్‌గా చంద్రారెడ్డి

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీ స్టాండింగ్ కౌన్సిల్‌గా(ఏపీహైకోర్టు) అడ్వకేట్ ఆర్.చంద్రారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు లీగల్ అండ్ లెజిస్లేటివ్ అఫైర్స్ అండ్ జస్టిస్ సెక్రటరీ జి.ప్రతిభాదేవి బుధవారం నియామక ఉత్తర్వులు వెలువరించారు. మూడేళ్లపాటు ఈయన ఈ పదవిలో కొనసాగుతారు.

ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



ధ్వజస్తంభాన్ని శుభ్రం చేస్తున్న అధికారులు,అర్చకులు

చంద్రగిరి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఘనంగా కోయిల్‌ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. ఈనెల 18నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్న క్రమంలో ముందుగా ఈకార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. తెల్లవారుజామున స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగశ్రవణం నిర్వహించారు. ఉదయం 6.30 నుంచి 10.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరిగింది. ఆలయప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితరాలను నీటితో శుద్ధి చేశారు. అనంతరం సుగంధ ద్రవ్యాల పవిత్ర మిశ్రమంతో ప్రోక్షణ చేశారు. ఉదయం 11 గంటల నుంచి భక్తులకు దర్శనానికి అనుమతించారు.

పల్లెపండుగ పనులను నెలాఖరుకు పూర్తి చేయాలి

తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి గురువారం పంచాయతీరాజ్, డ్వామా అధికారులతో అభివృద్ధి పనుల పురోగతిపై వర్చువల్‌గా సమీక్షించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు, సీసీ రోడ్ల నిర్మాణంలో పురోగతి చూపాలన్నారు. పుత్తూరు, సత్యవేడు, నాగలాపురం, వడమాలపేట మండలాలు లక్ష్య సాధనలో వెనుకంజలో ఉన్నాయని, పురోగతి చూపాలని అన్నారు. డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, పీఆర్ ఈఈ, డీఈలు, ఏఈలు, ఎంపీడీవోలు, ఏపీవోలు పాల్గొన్నారు.

రేపటి నుంచి అరుణాచలం ప్యాకేజీ టూర్

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో తమిళనాడులోని అరుణాచలానికి డైలీ ప్యాకేజీ టూర్‌ను శనివారం నుంచి ప్రారంభించనున్నట్లు డివిజనల్ మేనేజర్ సి.హెచ్.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు శ్రీనివాసం నుంచి వోల్వో ఏసీ బస్సు బయలుదేరుతుందని పేర్కొన్నారు. తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు అరుణాచలంలో బయల్దేరి సాయంత్రం 5 గంటలకు వేలూరు గోల్డెన్ టెంపుల్, అక్కడి నుంచి సాయంత్రం 6 గంటలకు బయల్దేరి రాత్రి 9 గంటలకు తిరుపతి చేరుకుంటుందని వివరించారు. పెద్దలకు రూ. 1200, పిల్లలకు రూ.960 టిక్కెట్ ధర నిర్ణయించినట్లు తెలిపారు. టిక్కెట్స్‌ను ముందస్తుగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టూరిజం/ఏపీటీడీసీ.జీవోవీ.ఏపీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవచ్చునని పేర్కొన్నారు.మరిన్ని వివరాలకు 9848850099, 9848973985, 9848802099, 08772289123, 9848007033లను సంప్రదించాలని కోరారు.

సహకార సంఘాల బలోపేతానికి చర్యలు



తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల బలోపేతానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ 2025ని అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో సహకార సూత్రాలు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా రూపొందించిన కార్యక్రమాలను పక్కాగా అమలుపరచాలన్నారు. టెక్నాలజీని వినియోగించి ప్రాథమిక సహకారపరపతి సంఘాలను బలోపేతం చేయనున్నట్లు వివరించారు. ప్రతి రైతూ ప్రాథమిక సహకారపరపతి సంఘాల్లో సభ్యులుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 18నుంచి 28వ తేదీ వరకు నిర్వహించే సహకార అవుట్‌రీచ్ క్యాంపెయిన్‌ని విజయవంతం చేయాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీడీఎం నాబార్డ్ సునీల్, సీఈవో జుబేదబేగం పాల్గొన్నారు.

ఫ్లెమింగో ఫెస్టివల్ విజయవంతంపై సీఎం అభినందన

● జిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దడానికి కృషిచేస్తాం

● కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) : సూళ్లూరుపేట వేదికగా గత నెలలో ఫ్లెమింగో ఫెస్టివల్-2025ను విజయవంతం చేసిన జిల్లా యంత్రాంగాన్ని సీఎం చంద్రబాబు అభినందించారు. గురువారం పర్యాటక రంగంపై వెలగపూడి సచివాలయంలో సమీక్షించిన సీఎం ఫ్లెమింగో ఫెస్టివల్ ఆల్బమ్‌ను విడుదల చేశారు. పుస్తకాన్ని అద్భుతంగా రూపొందించారని మంత్రి కందుల దుర్గేష్, అధికార బృందాన్ని అభినందించారు. ముఖ్యమంత్రికి కలెక్టర్ ధన్యవాదాలు తెలుపుతూ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మరిన్ని కార్యక్రమాలు చేపట్టి జిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమం విజయవంతంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.



ఫ్లెమింగో ఫెస్టివల్ ఆల్బమ్‌ను విడుదల చేస్తున్న సీఎం చంద్రబాబు

ఏపీపీగా బాలకృష్ణమ నాయుడు



తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన ప్రముఖ న్యాయవాది ముప్పారపు బాలకృష్ణమ నాయుడు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు. ఈయన తిరుపతి ఐదవ జిల్లా అడిషనల్ సెషన్స్ కోర్టు, ఫ్యామిలీ కోర్టులో మూడేళ్ల పాటు సేవలు అందించనున్నారు. గతంలో ఈయన అసిస్టెంట్ గవర్నమెంటు ప్లీడర్‌గా పనిచేసి ప్రభుత్వం నుంచి రెండుసార్లు ఉత్తమ సేవా పతకం అందుకున్నారు. టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడిగా, నగర లీగల్ సెల్ అధ్యక్షుడిగా సేవలు అందించారు. ఈయన సేవలను గుర్తించిన ప్రభుత్వం మరోసారి అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించింది.

సాధువుల దీక్ష విరమణ

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): అలిపిరి రోడ్డులో ఒబరాయ్ హోటల్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ రెండు రోజులుగా టీటీడీ పరిపాలనా భవనం వద్ద శ్రీనివాస ఆనంద సరస్వతి ఆధ్వర్యంలో సాధువులు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను గురువారం రాత్రి విరమించారు. అదనపు ఎస్పీ రవిమనోహరాచారి నేతృత్వంలో ఈస్ట్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ బాలకృష్ణ దీక్షా శిబిరం వద్దకు చేరుకుని వారికి నచ్చజెప్పి, నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు.



విద్యుత్ స్టోర్‌ను పరిశీలించిన ఎస్ఈలు


స్పెషల్ మెయింటెనెన్స్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈలు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక గిరింపేటలో ఉన్న విద్యుత్ శాఖ స్టోర్స్‌ను చిత్తూరు, తిరుపతి ఎస్ఈలు ఇస్మాయిల్ అహ్మద్, సుకేంద్ర నాయుడు గురువారం పరిశీలించారు. అక్కడున్న విద్యుత్ పరికరాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్పెషల్ మెయింటెనెన్స్ కేంద్రాన్ని పరిశీలించారు. నూతనంగా వచ్చిన ఆయిల్ రీజనరేట్ మిషన్‌ను వారు పరిశీలించారు. వేసవిలో వీటి సేవలు అందించేందుకు త్వరగా అమర్చాలని అధికారులను ఆదేశించారు. అలాగే ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులను త్వరగతిని పూర్తి చేసి సకాలంలో అందించాలని సూచించారు. వారి వెంట ఈఈలు జగదీష్, వాసుదేవరెడ్డి, డీఈలు రవి, వసంత నాయుడు తదితరులు ఉన్నారు.

ప్రత్యేక ప్రతిభ కల్గిన బాలల గుర్తింపునకు ఇంటింటి ప్రచారం


ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న న్యాయవాదులు, పారా లీగల్ సిబ్బంది

చిత్తూరు లీగల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.ఎస్.భారతిల పర్యవేక్షణలో ప్రత్యేక ప్రతిభ కల్గిన బాలలను గుర్తించేందుకు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈనెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జిల్లాలో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో 6061 గృహాలను సందర్శించారు. ఇందులో 60మంది పిల్లలు ఎదుగుదల లోపంతో ఉన్నట్లు గుర్తించారు. వీరికి సరైన చికిత్స అందించేలా న్యాయ సేవాధికార సంస్థ చర్యలు తీసుకుంటోంది. ప్రత్యేక ప్రతిభ కల్గిన పిల్లలను గుర్తించే బృందంలో న్యాయవాదులు, పారా లీగల్ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్యాధికారులు ఉన్నారు. వీరు గ్రామాల్లో పర్యటించి ప్రత్యేక ప్రతిభ కల్గిన బాలలను గుర్తించి.. వారికి అవసరమైన సేవలు అందించేందుకు తోడ్పడుతున్నారు. గుర్తించిన బాలలకు డీఈఐసీ రాష్ట్రీయ బాల సురక్ష, రాష్ట్రీయ కిశోర సురక్ష కార్యక్రమాల ద్వారా వైద్యసేవలు అందిస్తారు. చిత్తూరు నగరంలోని శ్రీనగర్‌కాలనీ, సత్యనారాయణపురం, ఐరాల మండలంలోని వైఎస్ గేటు తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రత్యేక ప్రతిభగల పిల్లలను గుర్తించారు.

ఇసుక తరలించే మార్గంలో ట్రెంచ్ కటింగ్

నగరి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమంగా తరలించే మార్గాల్లో తహశీల్దార్ రవికుమార్ ఆధ్వర్యంలో గురువారం ట్రెంచ్ కటింగ్ ఏర్పాటు చేశారు. ఇసుకను ఇష్టానుసారం రాత్రి, పగలు తేడా లేకుండా తరలిస్తున్నారని పత్రవాడ, వినాయకపురం గ్రామస్తులు చేపట్టిన ధర్నాకు స్పందించి ట్రెంచ్ కటింగ్ ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ తెలిపారు.

వల్లభనేని వంశీ ఓ సైకో : టీడీపీ


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సురేంద్రకుమార్, వైపీ రాజేశ్వరి

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ఒక సైకో అని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్, తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వైపీ రాజేశ్వరి ఆరోపించారు. గురువారం చిత్తూరులోని జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వల్లభనేని వంశీకి రాజకీయ జీవితం ప్రసాదించింది టీడీపీయే అన్నారు. అటువంటి పార్టీ కేంద్ర కార్యాలయంపై దాడిచేయించడం దారుణమని చెప్పారు. ఆ సంఘటనపై కార్యాలయ ఉద్యోగి, దళిత యువకుడు సత్యవర్దన్ ఫిర్యాదు చేస్తే వంశీ అనుచరులు అతడిని కిడ్నాప్ చేయించి, చంపుతానంటూ బెదిరించారని ఆరోపించారు. ఒక నేరాన్ని కప్పి పుచ్చుకోవడానికి మరో నేరానికి పాల్పడిన వంశీని గురువారం అరెస్టు చేయడాన్ని హర్షిస్తున్నామని చెప్పారు. అలాగే తల్లి లాంటి నారా భువనేశ్వరిని తప్పుడు మాటలు మాట్లాడి ఆమె మనసును గాయపరిచిన వంశీ పాపం పండిందని హర్షం వ్యక్తం చేశారు. మాజీ సీఎం జగన్ అండతో అధికారాన్ని అడ్డుపెట్టుకుని రౌడీయిజంతో రాజకీయం చేసిన వాళ్ళు ఎప్పటికైనా శిక్ష అనుభవించక తప్పదన్నారు. టీడీపీ నేతలు విజయ్ కుమార్, బాలు, గోపాల్, ధరణి తదితరులు పాల్గొన్నారు.

ఎంసీఏ, ఎల్ఎల్‌బీ ఫలితాల విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలో నిర్వహించిన ఎంసీఏ, ఎల్ఎల్‌బీ (3, 5 ఐదేళ్ల కోర్సుల) నాల్గవ సెమిస్టర్ ఫలితాలు విడుదలయ్యాయి. ఈ మేరకు సీఈ దామ్లానాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

వీఆర్‌కు చిత్తూరు తాలూకా ఎస్ఐ

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు తాలూకా పోలీస్‌స్టేషన్ ఎస్ఐ రమేష్ బాబును ప్రభుత్వం వీఆర్‌కు పంపించింది. స్పెషల్ బ్రాంచ్‌లో ఎస్ఐగా ఉన్న మల్లికార్జున్‌ను తాలుకా పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా నియమించారు. అలాగే తాలుకా పోలీస్‌స్టేషన్లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న శేఖర్‌ను నగరికి బదిలీ చేశారు.

బీసీ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కలికిరి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మహాత్మా జ్యోతీబా పూలే బీసీ గురుకుల పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ జారీ అయింది. బీసీ గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్, పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు పంపుకోవాలని కలికిరి బాలికల బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనరు వై.సోమశేఖర్ తెలిపారు. అంతేగాకుండా 6, 7, 8, 9వ తరుగతుల్లో అందుబాటులో ఉన్న బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం కూడా దరఖాస్తులు పంపుకోవచ్చని తెలిపారు. చిత్తూరు జిల్లాలోని సదుం బాలుర జూనియర్ కళాశాలతో పాటు సదుం, కుప్పం (బాలురు), పెద్దపంజాణి, పులిచెర్ల (బాలికలు) బీసీ గురుకుల పాఠశాలల్లోనూ, తిరుపతి జిల్లాలోని సత్యవేడు, ఐతేపల్లె (బాలురు) ఉదయమాణిక్యం (బాలికలు) పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు పంపుకోవాలన్నారు. అదేవిధంగా అన్నమయ్య జిల్లాకు సంబంధించి తంబళ్లపల్లె (బాలురు), కలికిరి, పీలేరు (బాలికలు) పాఠశాలల్లో కూడా ప్రవేశాలున్నాయని సోమశేఖర్ వివరించారు. వీటన్నిటిలోనూ అందుబాటులో ఉండే బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం కూడా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఈనెల 15 నుంచి మార్చి 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని కోరారు. ఆయా పాఠశాలలు, కళాశాలల వారీ అందుబాటులో ఉన్న సీట్ల వివరాలు కూడా ఆన్‌లైన్‌లో ఉన్నాయని తెలిపారు. జూనియర్ ఇంటర్ ప్రవేశాలకు ఏప్రిల్ 20న, 5వ తరగతి ప్రవేశాలకు 27న, బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి 28న ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థుల తల్లిదండ్రుల ఆదాయం రూ.లక్షకు మించకూడదన్నారు. సంబంధిత జిల్లాలోని ప్రభుత్వ లేదా ప్రైవేటు పాఠశాలల్లో చదువుతూ ఉండాలన్నారు. ఇతర వివరాలు లేదా సందేహాల కోసం 90007 15637, 87900 92069, లేదా 79894 45396 నెంబర్లలో సంప్రదించాలని కన్వీనరు తెలిపారు.

మినిమం టైం స్కేల్ అమలు చేయాలి

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : కాంట్రాక్టు కార్మికులకు మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర, ఆప్కాస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చినబాబు డిమాండ్ చేశారు. 16వ తేదీ తిరుపతిలో జరగనున్న కార్మిక సదస్సు జయప్రదం కోసం ముద్రించిన కరపత్రాలను గురువారం వారు విడుదల చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 2ను సవరించి అందరికీ సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరారు. ఎమ్మెల్సీ ఐ.వేంకటేశ్వరరావు, జేఏసీ చైర్మన్ ఏవీ నాగేశ్వరరావు హాజరుకానున్న ఈ సదస్సును జయప్రదం చేయాలని కోరారు.

బర్డ్‌ఫ్లూపై ఆందోళన చెందొద్దు



చికెన్, గుడ్లు బాగా ఉడికించి తినొచ్చు ● వెటర్నరీ వర్సిటీ డీఆర్ డాక్టర్ శ్రీలత


మాట్లాడుతున్న ప్రొఫెసర్ శ్రీలత, డాక్టర్ శోభామణి, డాక్టర్ నాగేశ్వరరావు

తిరుపతి రూరల్, ఫిబ్రవరి13 (ఆంధ్రజ్యోతి): బర్డ్‌ఫ్లూపై ఎలాంటి ఆందోళన వద్దని, బాగా ఉడికించిన చికెన్‌మీట్, కోడిగుడ్లను నిర్భయంగా తినొచ్చని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్(డీఆర్) ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ శ్రీలత స్పష్టం చేశారు. వర్సిటీలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇటీవల ఉభయగోదావరి జిల్లాల్లో బర్డ్‌ఫ్లూ ఎక్కువ కావడంతో చికెన్, కోడి గుడ్లు తినొచ్చో లేదోనన్న సంశయంలో జనం ఉన్నారన్నారు. ఈ వ్యాధి బర్డ్ నుంచి బర్డ్‌కి వ్యాపిస్తుందేగానీ బర్డ్ నుంచి మనుషులకు సోకదని స్పష్టం చేశారు. ఇప్పటివరకు దేశంలో బర్డ్‌ఫ్లూ వల్ల మనుషులు మరణించిన దాఖలాలు లేవన్నారు. దీనికి టీకా (వ్యాక్సిన్) లేనందున నివారణ చర్యలు మాత్రమే చేపట్టాలని సూచించారు.

వ్యాప్తి ఇలా..

ఉష్ణోగ్రతలు తక్కువగా ఉన్నప్పుడు ఏవియన్ ఇన్‌ఫ్లూయెంజా వైరస్ ద్వారా బర్డ్ ఫ్లూ సోకుతుందని శ్రీలత తెలిపారు. వలస పక్షులు, కంటామినేటెడ్ ఫీడ్ అండ్ వాటర్ ద్వారా ఒకదాని నుంచి మరో దానికి వ్యాప్తి చెందుతుందన్నారు. కోళ్ల సాంద్రత ఎక్కువగా ఉన్న చోట వ్యాధి త్వరగా వ్యాపిస్తుందన్నారు. అధిక ఉష్ణోగ్రతల్లో (34-35డిగ్రీలు) వైరస్ మనుగడ (జీవనం) సాగించదని తెలిపారు.

వ్యాధి లక్షణాలు

బర్డ్‌ఫ్లూ సోకిన కోళ్ల కళ్లు, ముక్కుల నుంచి ద్రవాలు కారడం, తల వాపు, మెడ, కాళ్లు వంకరపోవడం, నరాల సంబంధిత లక్షణాలుంటాయని శ్రీలత వివరించారు. వీటిని చూసిన రైతులు సంబంధిత వైద్యాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. 'చనిపోయిన కోళ్లను గుంతలు తీసి సామూహికంగా పూడ్చిపెట్టి దానిపై బ్లీచింగ్ చల్లాలి. కుక్కలు, ఇతర జంతువులు ఈ మట్టిని తవ్వకుండా ముళ్ల కంప వేయాలి. ఈ విషయంలో నిర్లక్ష్యంగా ఉంటే మిగతా కోళ్ల మరణాల శాతం ఎక్కువగా ఉంటుంది. కోళ్ల ఫారాల్లో సిబ్బందికి పీపీఈ కిట్లు, క్లోరినేటెడ్ మందులను వినియోగించాలి. ఫారాల్లోకి వచ్చే వాహనాలను స్టెరిలైజ్ చేయాలి. వలస పక్షులు రాకుండా చూడాలి' అని ఆమె వివరించారు. ఈ మీడియా సమావేశంలో డీఈ డాక్టర్ శోభామణి, డెయిరీ డీన్ డాక్టర్ నాగేశ్వరరావు, వివిధ విభాగాల ప్రొఫెసర్లు డాక్టర్ ఆనందరావు, డాక్టర్ రాణీప్రమీల, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ జీఆర్‌కే శర్మ తదితరులు పాల్గొన్నారు.

బాలాజీ రిజర్వాయరుపై కసరత్తు

● ఏపీ జనవరులశాఖ సలహాదారు కన్నయ్య నాయుడు


పాపవినాశనం జలాశయ గేట్లను పరిశీలిస్తున్న కన్నయ్య నాయుడు

తిరుమల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): 'కృష్ణా నీటిని కుప్పం వరకు తీసుకువచ్చేలా చాలా ప్రతిపాదలను పెట్టాం. మధ్యలో చాలా బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు వచ్చాయి. ప్రభుత్వ నిధులను బట్టి ఒక్కొక్కటిగా నిర్మాణం చేపడుతూ వస్తోంది. వీటిలో బాలాజీ రిజర్వాయర్ కూడా ప్రాధాన్యంలో ఉంది. దీనికి అధికారులు కసరత్తు చేస్తున్నారు' అని ఏపీ జనవరుల శాఖ సలహాదారు కన్నయ్య నాయుడు తెలిపారు. తిరుమలలోని పాపవినాశనం, గోగర్భం డ్యామ్‌ల పటిష్ఠత, గేట్లను తన బృందంతో కలిసి గురువారం పరిశీలించిన ఆయన 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రభుత్వం నిధులు కేటాయిస్తే ప్రాజెక్టులు త్వరగా పూర్తవుతాయన్నారు. ఇక, తిరుమలలో నీటి సమస్య లేకుండా చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కాళంగి ప్రాజెక్ట్ సామర్థ్యాన్ని 0.2 టీఎంసీ నుంచి 2 టీఎంసీలకు పెంచేందుకు సర్వే పూర్తయిందన్నారు. ఇందులో నాలుగు గ్రామాల్లో భూసేకరణ పూర్తయితే జలాశయం అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ నీటిని తిరుపతికి వాడుకుంటే.. నగర సమీపంలోని అన్ని డ్యాముల నీటిని తిరుమలకు తీసుకెళ్లడం ద్వారా భక్తులకు నీటి ఇబ్బందులు ఉండవన్నారు.

సీడాప్ ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి

● ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు


సీడాప్ క్యూఆర్ కోడ్

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): సీడాప్ ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. దేశంలోనే అతిపెద్ద నైపుణ్య శిక్షణ సంస్థగా పేరొందిన 'సీడాప్' (సొసైటీ ఫర్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్) అనే సంస్థ ద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఉపాధి, మార్కెట్ ఆధారిత నైపుణ్య కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా ప్రతి పేద కుటుంబానికి ఉపాధి అవకాశం కల్పించడమే సీఎం చంద్రబాబు సంకల్పమని పేర్కొన్నారు. 18-35 ఏళ్ల వయసు కలిగిన నిరుద్యోగ యువత ఉపాధి కోసం క్యూఆర్ కోడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని ఉపాధి పొందేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం

తవణంపల్లె, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): షార్ట్ సర్క్యూట్‌తో మంటలంటుకొని కారు దగ్ధమైన సంఘటన మండలంలోని ఐరాల క్రాస్ వద్ద గురువారం రాత్రి జరిగింది. తిరుపతికి చెందిన భక్తులు కారులో తమిళనాడు రాష్ట్రం వేలూరు సమీపంలో గల బంగారు గుడికి వెళ్లి అక్కడ నుంచి కాణిపాకం దర్శనం నిమిత్తం తిరిగి వస్తుండగా ఐరాల క్రాస్ వద్ద కారులో వాసన రావడంతో డ్రైవర్ దిగి కారు బ్యానెట్ తీస్తుండగా షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలంటుకున్నాయి. దీంతో కారులో ఉన్న భక్తులు భయంతో కారు దిగి దూరంగా వెళ్లిపోయారు. మంటలు అంటుకొన్న వెంటనే స్థానికులు గమనించి అగ్ని మాపక కేంద్రానికి సమాచారం ఇచ్చినా గంట సమయం గడిచినా వారు రాకపోవడంతో కారు పూర్తిగా దగ్ధమైంది. దీంతో ఈ దారిలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

మిట్టూరు చెరువుకు హంద్రీ-నీవా కాలువ నుంచి తూము నిర్మించాలి

నెర్నపల్లె పంచాయతీ రైతుల వేడుకోలు


వి.కోట మండలం మిట్టూరు వద్ద మొదలైన హంద్రీ-నీవా కాల్వ పనులు - చుక్కనీరు లేక ఎండిన మిట్టూరు చెరువు

వి.కోట, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): వి.కోట మండలం మీదుగా కుప్పం వెళ్ళే హంద్రీ-నీవా కాల్వపనులను గతవారం పునఃప్రారంభించారు.నెర్నపల్లె పంచాయతీ మిట్టూరు సమీపంలో కాల్వకు ఇరువైపులా లైనింగ్ పనులతో పాటు క్రింది భాగంలోను కాంక్రీట్ వేసేపనులు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు కాల్వ కింది భాగంలో కాంక్రీట్ లేకపోవడంతో నీరు ప్రవహించేసమయంలో భూమిలో ఇంకి చెరువులోకి చేరేది. ప్రస్తుతం కాంక్రీట్ పనులు మొదలవడంతో తమ చెరువు పై భాగంలో తూము ఏర్పాటు చేయకపోవడంతో కాల్వ నుంచి నీరు వచ్చే అవకాశం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.హంద్రీ - నీవా గుత్తేదారులను తూము విషయమై ప్రశ్నిస్తే కిలోమీటరు 43.750వద్ద పనులు అటు, ఇటుగా జరుగుతున్నాయని, ఈ చెరువుకు ఎగువన 44.150 వద్ద అవుట్ లెట్ ఉందంటున్నారు. అక్కడ తూము ఏర్పాటు చేస్తే మిట్టూరు చెరువుకు ఉపయోగం ఉండదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాగలాపురం బ్యాంకులో కొనసాగుతున్న విచారణ

నాగలాపురం, ఫిబ్రవరి 13, (ఆంధ్రజ్యోతి): నాగలాపురంలోని ఓ బ్యాంకులో ఉద్యోగి చేతి వాటాన్ని ప్రదర్శించి రూ.2 కోట్ల మేర నగలు గోల్‌మాల్ చేసిన వ్యవహారంపై విచారణ కొనసాగుతోంది. ఈ వ్యవహారం గురించి 'నాగలాపురంలో లక్కీ భాస్కర్' శీర్షికన ఆంధ్రజ్యోతిలో గురువారం బయటపెట్టిన విషయం తెలిసిందే. ఈ అక్రమాలపై బ్యాంకులో ఉన్నతాధికారుల బృందం విచారణ లోతుగా జరుపుతున్నట్లు తెలుస్తోంది. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. దీనిపై బ్యాంకు అధికారులను వివరణ కోరగా.. బ్యాంకులోని నగలు భద్రంగా ఉన్నాయంటూ పొంతనలేని సమాధానం చెబుతూ అసలు విషయాలను దాటవేసే ప్రయత్నం చేశారు. కాగా నగల వ్యవహారంపై పోలీసులను కూడా బ్యాంకు అధికారులు సంప్రదించినట్లు సమాచారం. న్యాయ నిపుణల సలహా మేరకు ఈ ఘటనపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలన్న అంశంపై యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

బ్యాంకు అధికారులపై వేటు: నగల గోల్‌మాల్ వ్యవహారంలో పలువురు బ్యాంకు సిబ్బందిపై వేటుపడే అవకాశమున్నట్లు కనిపిస్తోంది. ఇందులో భాగంగా బ్యాంకులో కీలకంగా ఉన్న ఇద్దరిలో ఒకరిని ఇప్పటికే సస్పెండ్ చేసినట్లు, తాజాగా మరొకరిని కూడా విధుల నుంచి దూరం పెట్టినట్లు తెలిసింది. ఈ ఘటనలో వీరి ప్రమేయం ఎంత వరకు ఉంది, ఏమేరకు అక్రమాలకు పాల్పడ్డారన్న విషయంపై ముమ్మరంగా విచారణ జరుపుతున్నారు. ఈ విచారణ మరో మూడు రోజులు కొనసాగుతుందని, పూర్తయిన వెంటనే మీడియాకు వెల్లడిస్తామని బ్యాంకు అధికారులు తెలిపారు.

భూమిరెడ్డిపల్లి రహదారికి రూ.80 లక్షల మంజూరు

యాదమరి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూమిరెడ్డిపల్లి రహదారి మరమ్మతు పనులకు సంబంధించి రూ.80 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులను కలెక్టర్ సుమిత్‌కుమార్ మంజూరుచేశారు. గతనెల 28వ తేదీన చిత్తూరు-గుడియాత్తం రహదారి విస్తరణ పనుల పురోగతిని పరిశీలించడానికి విచ్చేసిన కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే మురళీమోహన్ దృష్టికి భూమిరెడ్డిపల్లి వద్ద రహదారి దెబ్బతిన్న విషయమై గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మురళీమోహన్ చొరవతో గురువారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.80 లక్షలను మరమ్మతులకు కేటాయించారు. ఎమ్మెల్యే, కలెక్టర్ సానుకూలంగా స్పందించడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

కనువిందుగా ప్రణయ కలహోత్సవం


కుంభహారతి మండపం వద్దకు వేంచేస్తున్న స్వామివారు - స్వామి వారిపై పూలచెండు విసురుతున్న వేదపండితుడు

తిరుపతిఅర్బన్,ఫిబ్రవరి13(ఆంధ్రజ్యోతి): గోవిందరాజస్వామి ఆలయంలో గురువారం ప్రణయ కలహ మహోత్సవం కనువిందు చేసింది. అధ్యయనోత్సవాలలో భాగంగా ఏటా ఈ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. సాయంత్రం 5 గంటలకు గోవిందరాజస్వామి పల్లకిలో ఆలయ ప్రాంగణంలోని కుంభహారతి మండపం వద్దకు, అమ్మవార్లు వేర్వేరు పల్లకిలో స్వామివారికి అభిముఖంగా వేంచేశారు. వేదపండితులు పురాణపఠనం చేస్తుండగా అమ్మవార్ల తరపున జియ్యంగార్లు పూలచెండ్లతో విహారయాత్రకు వెళ్లి వచ్చిన స్వామివారిని మూడుసార్లు తాకించారు. దీంతో స్వామివారు బెదిరినట్లుగా నటించి తానేమి తప్పు చేయలేదని అమ్మవార్లను ప్రాధేయపడడమే ప్రణయ కలహ మహోత్సవ ఘట్టం.కార్యక్రమం ఆద్యంతం నయనానందకరంగా సాగింది. భక్తులు, స్థానికులు ఆసక్తిగా తిలకించి తన్మయత్వం చెందారు. అమ్మవార్లు శాంతించి స్వామివారికి ఇరువైపులా ఆశీనులై కర్పూరహారతులు అందుకుని ఆలయానికి వేంచేపుచేశారు. అనంతరం ఆస్థానం నిర్వహించారు. పెద్దజియ్యర్, చిన్నజియ్యర్, ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనంజయ పాల్గొన్నారు.

టీవీసీసీ సేవలను అడ్డుకున్న వెటర్నరీ విద్యార్థులు


టీవీసీసీ ముందు నిరసన తెలుపుతున్న విద్యార్థులు

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచాలని ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారమూ కొనసాగింది. ఇందులో భాగంగా తారకరామ వెటర్నరీ క్లినికల్ కాంప్లెక్స్ (టీవీసీసీ)వద్దకు చేరుకుని వైద్యసేవలను అడ్డుకున్నారు. క్లినికల్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు సేవలను నిలిపివేశారు. అలాగే పశువైద్యులు అందిస్తున్న సేవలు, స్టైఫండ్ పెంపు అవశ్యకతను స్కిట్ రూపంలో ప్రదర్శించి వివరించారు. విద్యార్థులు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్‌ని పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో ఎమర్జెన్సీ సేవలను కూడా అడ్డుకుంటామని తెలిపారు.

తల్లి మందలించిందని విద్యార్థి పరార్

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): 10వ తరగతి పరీక్షలు దగ్గరపడుతున్నా సరిగా చదవడం లేదని తల్లి మందలించడంతో విద్యార్థి పరారైన ఘటన సింగాలగుంటలో గురువారం చోటుచేసుకుంది. సింగాలగుంటకు చెందిన సాయి శ్రీహరి ప్రైవేటు స్కూల్లో పదో తరగతి చదువుతున్నాడు. పరీక్షలకు సరిగా ప్రిపేర్ కాకపోవడంతో తల్లి మందలించింది. మనస్తాపానికి గురైన శ్రీహరి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడని, తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని అలిపిరి ఎస్ఐ నాగార్జున రెడ్డి తెలిపారు.

వంతెన ఆక్రమణ..!



సదుం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సదుం గ్రామ నడిబొడ్డున సాగే గార్గేయ నదిపై ఇటీవల నిర్మించిన నూతన వంతెన కింద వర్షపు నీరు సాఫీగా ప్రవహించేందుకు ఆటంకంగా స్థానిక రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆక్రమణకు పాల్పడ్డాడు. ఆక్రమిత స్థలంలో భారీ ఎత్తున మట్టి, రాళ్లతో నింపి వంతెన కింద ఓ బ్లాక్‌ను పూర్తిగా మూసివేశాడు. ఇది భవిష్యత్తులో బ్రిడ్జి కింద నీరు సాఫీగా సాగేందుకు ఆటంకంగా మారుతుంది. అలాగే వంతెనకు ముప్పు పొంచి ఉంటుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులు దర్జాగా ఆక్రమించినా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటం పలు విమర్శలకు తావిస్తోంది. వంతెన భద్రత బాధ్యత చూసుకోవడంతోపాటు అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన అధికారులు ఇకనైనా స్పందించి ఆక్రమిత స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే సదుం-కల్లూరు రోడ్డు ప్రాంతంలో ఉన్న శ్రీ వీరభద్ర స్వామి ఆలయ మాన్యం భూమిలో సర్వే నంబరు 164/3ఏలో 0.37 సెంట్లు, స్థానిక కుమారుని ఒడ్డుకు సాగే సాటునీటి కాలువ సర్వేనంబరు 77/4లో 0.47 సెంట్లు, 77/1ఏలో 0.60 సెంట్లు భూమి స్థానిక రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఆక్రమణలో ఉందని, అలాగే తన ఇంటి జాగాను సైతం దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని బాధితుడు హేమాద్రి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై సదుం తహసీల్దారు ఎస్.ఎం.హుస్సేన్ మాట్లాడుతూ సంబంధిత ఆక్రమిత స్థలాలను పరిశీలించి వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కార్యకర్త కుటుంబానికి టీడీపీ ఆర్థికసాయం



కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న పత్రి నారాయణాచారి

రామకుప్పం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం జీడిమాకులపల్లెకు చెందిన టీడీపీ కార్యకర్త కృష్ణప్ప కుమార్తె అను బుధవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందింది. టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్రి నారాయణాచారి, తెలుగు యువత మండల అధ్యక్షుడు విశ్వనాథ్‌లు స్థానిక నేతలతో కలిసి అను మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ తరఫున రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణప్ప, పార్టీ పంచాయతీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పులిచెర్లలో ప్రత్యేకాధికారి తనిఖీలు



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చిట్టెమ్మ

కల్లూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి ఉన్నత పాఠశాల, పీహెచ్‌సీ, అంగన్‌వాడీ కేంద్రం, కావేటిగారిపల్లి ఉన్నత పాఠశాలలను గురువారం చిత్తూరు దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్, పులిచెర్ల ప్రత్యేకాధికారి చిట్టెమ్మ ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. మధ్యాహ్న భోజనం, పాఠశాల రికార్డులను పరిశీలించారు. భోజనం రుచికరంగా ఉండాలని, పర్యవేక్షణ ఉండాలని హెచ్ఎం హరిశంకర్‌కు సూచించారు. అనంతరం పీహెచ్‌సీని సందర్శించి ప్రభుత్వాసుపత్రులకు వచ్చే పేదలకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్ యల్లయ్యకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈవోలు శిద్ధరామయ్య, పోకల తాతయ్య, హెచ్‌ఎంలు హరిశంకర్, మంజువాణి, సీఆర్‌పీలు అష్రఫ్, మునీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులు



పుంగనూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీకి ఆదాయం చేకూర్చిన ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నట్లు పుంగనూరు ఆర్టీసీ డిపో మేనేజర్ సుధాకరయ్య తెలిపారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో ఆర్టీసీకి డీజల్ ఆదా చేయడం, ఆదాయం పెంచడానికి సహకరించిన డ్రైవర్లు బీఎల్ ఖాన్, అన్వర్, కండక్టర్లు రెడ్డెప్ప, సురేశ్‌లకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకించాలి



పుంగనూరులో ఎస్డీపీఐ నాయకుల నిరసన

పుంగనూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లు చట్టం తేవడానికి పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టడాన్ని అందరూ వ్యతిరేకించాలని పుంగనూరులో గురువారం ఎస్డీపీఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. స్థానిక ఇందిరా సర్కిల్‌లో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగానికి విరుద్ధంగా పార్లమెంటులో వక్ఫ్ సవరణ చట్టం బిల్లును ప్రవేశపెట్టడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఎస్డీపీఐ నాయకులు యూసుఫ్, చాంద్‌బాషా, అన్వర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

జేఈఈలో విద్యార్థిని సాయిబృంద ప్రతిభ



సాయిబృందను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

గంగవరం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో మదర్‌థెరిసా కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని సాయిబృంద జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ రవీంద్ర బాబు తెలిపారు. గురువారం కళాశాల యాజమాన్యం, సిబ్బంది సాయిబృందను పూలమాలలతో సన్మానించారు. బుధవారం విడుదలైన ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచి 98.01 శాతం మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. సాయిబృందను అభినందించి రూ.10 వేలు నగదు బహుమతిని అందించారు. అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సల్లాపురమ్మ జాతర



సోమల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): చీకలగుట్టలో కొలువైన గంగోడమ్మ సల్లాపురమ్మ జాతర వేడుకల్లో భాగంగా గురువారం అమ్మవారిని పలు గ్రామాల్లో ఊరేగించారు. చింపిరెడ్డిపల్లి గ్రామస్తుల ఆధ్వర్యంలో ఉట్లు తిరునాలను నిర్వహించారు. నిర్వాహకులను గ్రామస్తులు సన్మానించారు. టీఎం.గొల్లపల్లె, అన్నెమ్మగారిపల్లె, వడ్డిపల్లె గ్రామస్తుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమాల్లో మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు, బాలాజీ నాయుడు, గుత్తా రెడ్డెప్ప, రవి నాయుడు, పెద్దరెడ్డెప్ప, భక్తులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

సోమల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు ఇష్టపడి చదివి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈవో శివరత్న అన్నారు. గురువారం సోమల ఉన్నత పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల నైపుణ్యాలను గుర్తించి ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. తల్లిదండ్రులకు ఎప్పటికప్పుడు పిల్లల సామర్థ్యం వివరాలు తెలియజేయాలని సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సూచనలు చేశారు. హెచ్.ఎం.హరినాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



అవగాహన ర్యాలీలో కమ్మనపల్లె గురుకుల పాఠశాల విద్యార్థినులు

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర ప్రదేశ్ సాధనలో భాగంగా ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలనే ఉద్దేశంతో మండలంలోని కమ్మనపల్లె గురుకుల పాఠశాల విద్యార్థినులు గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ శోభ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడానికి ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలన్నారు. విరివిగా మొక్కలు నాటాలని కోరారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

15న సంత్ సేవాలాల్ మహరాజ్ ర్యాలీని విజయవంతం చేయాలి



విలేకరులతో మాట్లాడుతున్న గిరిజన సంఘ నాయకులు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 15న పుంగనూరులో తలపెట్టిన సంత్ సేవాలాల్ మహరాజ్ ర్యాలీని విజయవంతం చేయాలని గిరిజన సంఘ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పుంగనూరు మండలంలోని ఏడు తాండాల గిరిజన మహిళలు, విద్యార్థులు, మేథావులతో కొత్తయిండ్లులోని అమరనాథరెడ్డి పెట్రోల్ బంక్ నుంచి ఇందిరా సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. గిరిజనులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రాజు కాలువ ఆక్రమణల తొలగింపు



పరిహద్దులు వేస్తున్న అధికారులు

కుప్పం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘం పరిధిలోని రాజు కాలువ ఆక్రమణలపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించారు. 19వ వార్డు పరిధిలో గురువారం సర్వే నిర్వహించి రాజు కాలువను ఆక్రమించి వేసిన లేఅవుట్లను, ఆక్రమణలను తొలగించారు. సరిహద్దులు నిర్మించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకుని అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు స్పందన

ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన కలెక్టర్ సుమిత్ కుమార్, జేసీ విద్యాధరి



కలెక్టర్ సుమిత్ కుమార్, జేసీ విద్యాధరికి అర్జీలు అందిస్తున్న కుప్పం ప్రజలు

కుప్పం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): చాలా కాలం తర్వాత కుప్పం మండల సచివాలయంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి, కడా పీడీ వికాస్ మర్మత్‌లతోపాటు వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్న ఈ వేదికలో నియోజకవర్గంలోని ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు వెల్లువెత్తాయి. అత్యధికంగా 74 రెవెన్యూ, అత్యల్పంగా దేవాదాయ, పశు సంవర్ధక, ప్రజారోగ్యం, పాఠశాల విద్య, పంచాయతీరాజ్ శాఖలతో పాటు ఇతర శాఖలకు సంబంధించిన సమస్యలపై అర్జీలుఅందాయి. సమస్యలు విన్న కలెక్టర్, సంబంధిత శాఖలకు అప్పగించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు.



● రామకుప్పం మండలం మణీంద్ర పంచాయతీ అత్తి కుప్పం గ్రామానికి చెందిన బి.శ్రీనివాసులు గౌడు, అదే గ్రామ రెవెన్యూ పరిధిలోని 0.3 సెంట్ల సెటిల్మెంట్ భూమిని పూర్వీకుల కాలం నుంచి సాగు చేసుకుంటున్నారు. తండ్రి మరణించిన తర్వాత ఆ భూమిని తన పేరుపై ఆన్‌లైన్ చేసుకున్నారు. అయితే రీ సర్వేలో 0.35 సెంట్ల బదులు 0.30 సెంట్లు అని ఆన్‌లైన్‌లో నమోదైంది. మళ్లీ సర్వే చేసి తనకున్న మొత్తం భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని శ్రీనివాసులు గౌడు కోరారు.



● గుడుపల్లె మండలం గుత్తార్లపల్లె గ్రామానికి చెందిన బినరసమ్మ మోకాళ్ల నొప్పులతో బాధ పడుతున్నారు. ఎవరూ లేని తనకు ప్రభుత్వం నుంచి పింఛను అందుతోంది. మోకాళ్ల నొప్పుల ఆపరేషన్‌కు ఆర్థిక సాయం మంజూరు చేయాలని ఆమె కోరింది.

● కుప్పం మండలం వి.మిట్టపల్లె గ్రామానికి చెందిన చక్రవర్తి కాలు రెండేళ్ల క్రితం వరి కొట్టే యంత్రంలో తగులుకుని విరిగిపోయింది. కుడిచేయి తెగిపోయింది. వికలాంగుడైన తనకు పింఛను మంజూరు చేయాలని ఆయన కోరారు.

● రామకుప్పం మండలం గట్టూరు తాండా పంచాయతీకి చెందిన ఎం.అయ్యా నాయక్ గ్రామ రెవెన్యూ పరిధిలోని 2.16 ఎకరాల భూమిని గత 50 ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్నారు. ఈ భూమికి పట్టాదారు పాసు పుస్తకం మంజూరు చేయాలని కోరారు.



● రామకుప్పం మండలం చెల్దిగానిపల్లెకు చెందిన ఎస్పీ వెంకటాచలం 0.50 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. అయితే 1997-2004 మధ్య కాలంలో ఇజ్రాయిల్ టెక్నాలజీ అమలులో భాగంగా పొలం గట్లు తొలగించడంతో 0.43 ఎకరాలకు భూమి విస్తీర్ణం తగ్గిపోయింది. తిరిగి సర్వే చేసి తన భూమికి సరైన హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు.



● శాంతిపురం మండలం తిమ్మరాజుపల్లె గ్రామానికి చెందిన వి.పెద్దన్న కుమారుడు చంద్రకాంత్ వ్యాస్కులార్ డిస్ట్రబ్ వ్యాధితో బాధపడుతూ నిమ్స్ ఆసుపత్రిలో వైద్యం చేసుకుంటున్నాడు. వైద్య ఖర్చుల కోసం రూ.50 వేలు మంజూరు చేయాలని కోరారు.



● కుప్పం మున్సిపాలిటీ ప్రత్యంగిరా దేవి ఆలయం సమీపంలోని ఆర్‌కేఎం.నగర్‌లోని డంపింగ్ యార్డు వద్ద రాత్రి పూట చెత్తను కాలుస్తుండటంతో దుర్వాసన భరించలేనంతగా వ్యాపిస్తోంది. దీంతో ఆరోగ్యం చెడిపోతోందని, వెంటనే ఇక్కడి నుంచి డంపింగ్ యార్డును తొలగించాలని ఎస్.పుష్పనాథన్‌తోపాటు కాలనీ వాసులు కోరారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

తహసీల్దారు కార్యాలయం ఎదుట బాధితుల ధర్నా



కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు

గంగవరం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): గంగవరానికి చెందిన వైసీపీ ఎంపీటీసీ భూఆక్రమణకు పాల్పడుతున్నారని.. వెంటనే చర్యలు తీసుకోవాలని గురువారం బాధితులు గంగవరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ తమ భూమిని గంగవరం వైసీపీ ఎంపీటీసీ అలైఖ్యబాలు, కుటుంబ సభ్యులతోపాటు మరికొందరు దౌర్జన్యం చేస్తూ ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని వాపోయారు. ఆక్రమణలు అడ్డుకుని న్యాయం చేయాలని వినతి పత్రం అందించారు. ధర్నాలో సరసమ్మ, లక్ష్మమ్మ, పద్మావతి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కురప్పల్లెలో వైభవంగా మసెమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో మసెమ్మ

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం ఆరడిగుంట పంచాయతీ కొండచెర్ల కురప్పల్లెలో గురువారం మసెమ్మ జాతరను గ్రామస్తులు వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ దేవతలైన కుంటిగంగమ్మ, ధనకుంట గంగమ్మ, బోయకొండ గంగమ్మ, నడివీధి గంగమ్మలకు తొలుతగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పుష్ప పల్లకిలో మసెమ్మ అమ్మవారిని కొలువుతీర్చి గ్రామాల్లో ఘనంగా ఊరేగించారు. మసెమ్మ జాతరను చుట్టుపక్కల 30 గ్రామాల ప్రజలు జరుపుకోవడం విశేషం. పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి, జనసేన నాయకుడు ఎన్.వేణుగోపాల్‌రెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

రేపు వీరాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

రామకుప్పం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని పిల్లిగుట్టలో నెలకొన్న వీరాంజనేయస్వామి ఆలయ ఐదో వార్షికోత్సవ పూజలు శనివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు అట్లూరి రాజగోపాల్ తెలిపారు. రుత్వికులు ఉదయం 10.30 గంటలకు గణపతి పూజ, గణపతి, మన్యసూక్త, మృత్యుంజయ హోమాలు నిర్వహిస్తారన్నారు. హోమాల్లో పాల్గొనే వారు ఫోన్‌నంబర్లు 8904425252, 9492427207, 7997766373 లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

కాశీవిశ్వేశ్వరాలయంలో పౌర్ణమి పూజలు

రామకుప్పం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రామకుప్పంలోని కాశీవిశ్వేశ్వరాలయంలో బుధవారం రాత్రి పౌర్ణమి పూజలు వైభవంగా జరిగాయి. ఉదయం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి అలంకరణలు చేపట్టారు. ఆలయ అర్చకులు కృష్ణమూర్తి, హరికుమార్ స్వామి రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శనం చేసుకున్నారు. అలాగే రామకుప్పం పట్టణ శివార్లలోని పిల్లి గుట్టల వద్ద ఆంజనేయస్వామి ఆలయంలో పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు.

గడ్డివామి దగ్ధం

కల్లూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం దేవళంపేట పంచాయతీ పెనుబాలలో రైతు నారాయణకు చెందిన గడ్డివామి గురువారం మధ్యాహ్నం దగ్ధమైంది. మధ్యాహ్న సమయంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో కల్లూరు పోలీసులకు, అగ్నిమాపక వాహనానికి బాధిత రైతు సమాచారం అందించాడు. ఎస్ఐ వెంకటేశ్వర్లు, అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపుచేశారు.

ఆవుల చోరీపై ఫిర్యాదు

సోమల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సోమల పంచాయతీ అడుసుపల్లెకు చెందిన గుండ్లూరు జనార్దన్, ముండ్రివారిపల్లెకు చెందిన కృష్ణారెడ్డి ఆవులు చోరీకి గురైనట్లు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారిస్తున్నారు.

సదుం మండలానికి పెరిగిన ఉపాధి యూనిట్లు

సదుం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సదుం మండలానికి బీసీ కార్పొరేషన్‌తో గతంలో ని 42 యూనిట్లకు అదనంగా మరిన్ని స్వయం ఉపాధి యూనిట్లు మంజూరైనట్లు ఎంపీడీవో హరిబాబు గురువారం తెలిపారు. బి-ఫార్మసీ, ఎం-ఫార్మసీ అర్హత కలిగి, 21 నుంచి 60 ఏళ్లలోపు ఉన్న బీసీలు జనరిక్ మందుల షాపుల నిర్వహణకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సూక్ష్మ, మధ్య, చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటుకు బలిజ, తెలగ ఒంటరి కులస్తులు 21 నుంచి 50 ఏళ్లలోపు వయస్సు ఉన్న వారు మార్చి 31లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన ఇన్‌కమ్ ట్యాక్స్ కట్టని వారు, స్కిల్ ఉన్నా.. లేకున్నా కార్మికులందరూ కేంద్ర ఈ-శ్రమ్ పథకంతో ప్రమాదవశాత్తు మృతి చెందిన వారి కుటుంబానికి ప్రభుత్వ ఆర్థిక సాయం కింద రూ.2 లక్షలు, వైకల్యం పొందిన వారికి రూ.లక్ష ఆర్థిక సాయం అందుతుందని, బాధితులు తమ పరిధిలోని సచివాలయాలలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

15 చౌడేపల్లె మండల సమావేశం

చౌడేపల్లె, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 15న చౌడేపల్లె మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో లీలామాధవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రగతి నివేదికలతో తప్పక హాజరు కావాలని కోరారు.

సమస్యల పరిష్కారానికే 'జన నాయకుడు'



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం వ్యక్తిగత కార్యదర్శి దుర్గా ప్రసాద్

గుడుపల్లె, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కుప్పం పార్టీ కార్యాలయంలో జన నాయకుడు పోర్టల్ ఏర్పాటు చేశారని.. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం తెలిపారు. గురువారం గుడుపల్లెలోని ఓ కల్యాణ మండపంలో టీడీపీ మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు తయారు చేయించారని.. త్వరలో మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలను ఆర్థికంగా అభివృద్ధి పరిచేందుకు పార్టీ కృషి చేస్తోందని తెలిపారు. హంద్రీ-నీవాతో త్వరలో నియోజకవర్గానికి సాగునీరు అందుతుందన్నారు. కొన్ని నెలల్లోనే పలు పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని తెలిపారు. కార్యకర్తలు ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. సీఎం వ్యక్తిగత కార్యదర్శి దుర్గాప్రసాద్, మండల టీడీపీ అధ్యక్షులు బాబు, రాష్ట్ర వన్నెకుల సాధికారిక అధ్యక్షులు మునిరాజు, నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేష్, హేమాంబర్ గౌడ్, బేటప్పనాయుడు, భానుమూర్తి, వెంకటేష్, సుబ్రహ్మణ్యం, గోవిందస్వామి, బేటప్ప, ప్రకాష్, శ్రీనివాసులు, ఎల్లప్ప, చంద్రప్ప, బాబు, మంజునాథ్, లక్ష్మీపతి, రమేష్, రామచంద్ర, హనుమంతు, యుగందర్ రెడ్డి, పాపన్న, బాలచందర్, విజయ్, రామప్ప, పురుషోత్తం, మురళీ, గోపాల్, నారాయణ, వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

రైతులు భూ ఆధార్ నమోదు చేసుకోవాలి



భూ ఆధార్ నమోదును పరిశీలిస్తున్న ఏవో సుధాకర్

సోమల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల్లో భూ ఆధార్ నమోదును రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో సుధాకర్ తెలిపారు. గురువారం సోమల, నంజంపేట, చిన్నఉప్పరపల్లె రైతు సేవా కేంద్రాల్లో ఆధార్ నమోదును పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. పంటల బీమా, పీఎం కిసాన్ యోజన, పంట నష్టపరిహారం, వ్యవసాయ యంత్రాల పరికరాలపై రాయితీలు తదితర పథకాలకు విశిష్ట గుర్తింపు సంఖ్య అవసరమని వివరించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల అధికారులు కుమార్, రాధిక, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్‌ను కలిసిన టీడీపీ విస్తరణ కమిటీ సభ్యుడు మంజునాథ్



కుప్పం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ఉండవల్లి నివాసంలో రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను కుప్పం నియోజకవర్గ టీడీపీ విస్తరణ కమిటీ సభ్యుడు ఎం.మంజునాథ్, లోకేశ్ గురువారం కలిశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలోని ప్రజా సమస్యలు, పార్టీ పరిస్థితి గురించి మంత్రి తమను ఆరా తీసినట్లు తెలిపారు. ఆయా సమస్యల పరిష్కారంపై లోకేశ్ సానుకూలంగా స్పందించారని చెప్పారు.

కొత్త వెంకటాపురంలో ఘనంగా కుంభాభిషేకం



కుంభాభిషేకంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు మురళీమోహన్, పులివర్తి నాని

పూతలపట్టు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు మండలం పి.కొత్తకోట పంచాయతీ కొత్తవెంకటాపురం గ్రామంలో మాజీ జడ్పీటీసీ వనజా బాబూరావు, స్థానిక నేత వాసు నిర్మించిన బాలవినాయక, బాలసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి గురువారం పూతలపట్టు, చంద్రగిరి ఎమ్మెల్యేలు కలికిరి మురళీమోహన్, పులివర్తి నానీ హాజరయ్యారు. వీరికి ఆలయ అర్చకులు సాంప్రదాయబద్ధంగా పూర్ణకుంభ స్వాగతం పలికారు. వీరు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్లకు గణపతి హోమం, మహా అభిషేకం, లక్షార్చన, శాంతిహోమం వంటి పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, అధికార ప్రతినిధి గంగారపు గోపి, నాయకులు బాబూరావు, ప్రతాపనేని చంద్రమౌళి, చంద్రబాబు, గణపతి నాయుడు, వాసు, నేతాజి, మండల నాయకులు, వెంకటాపురం గ్రామస్థులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై ఐవోసీఎల్ డ్రైవర్లకు అవగాహన



బహుమతులు అందుకుంటున్న డ్రైవర్లు

యాదమరి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రహదారి ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రక్ డ్రైవర్లకు అధికారులు అవగాహన కల్పించారు. రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని యాదమరిలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీఎల్) టెర్మినల్ కార్యాలయంలో రవాణాశాఖ అధికారులు ఆ సంస్థ సిబ్బందితో డీజిల్, పెట్రోల్ ట్యాంక్ డ్రైవర్లకు రహదారి నిబంధనలపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఆర్టీవో సునీల్ కుమార్ మాట్లాడుతూ తప్పనిసరిగా రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించి ప్రమాదాలు జరక్కుండా నిబంధనలు పాటించాలన్నారు. అనంతరం డ్రైవర్లకు క్విజ్ పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐవోసీఎల్ సంస్థ డీజీఎం అమితాబ్ సర్దార్, సీనియర్ మేనేజర్ అరుణ్ ప్రసాద్, ఎంవీఐలు రాజేశ్వరరావు, నీరుసింహులు, ఐవోసీఎల్ డీఎస్వో షణ్ముఖరాం, డ్రైవర్లు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలి



విద్యార్థికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ఏపీసీ వెంకటరమణ

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత, కృషీవలుడు అబ్దుల్ కలాంను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణ ఆకాంక్షించారు. గురువారం విజయం పాఠశాల 14వ వార్షికోత్సవ వేడుకలు ఆ విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి, అకడమిక్ డైరెక్టర్ శైలజామూర్తి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏపీసీ మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే ప్రతి అంశంపై అవగాహన పెంచుకోవాలని, క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్చుకోవాలని సూచించారు. అనంతరం అకడమిక్‌లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులతో పాటు వివిధ సాంస్కృతిక, క్రీడ ఇతర రంగాల్లో రాణించిన విద్యార్థులను జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన శివ పురాణం నాటిక అలరించగా, ఆటపాటలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. పాఠశాల హెచ్ఎం శ్రీదేవి, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంటి చూపు బాగుంటేనే ప్రపంచాన్ని చూడగలం



కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న నాయకులు, హెచ్ఎం తదితరులు

పెనుమూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ కంటిచూపు చాలా ముఖ్యమని, చూపు బాగుంటేనే ప్రపంచాన్ని చూడగలమని మాజీ జడ్పీటీసీ రుద్రయ్య నాయుడు పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో గురువారం పెనుమూరు జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. గత నెలలో విద్యార్థులందరికీ పరీక్షలు నిర్వహించారు. పెనుమూరు హైస్కూల్‌లో 20 మందికి, శాతంబాకంలో 6మందికి, ఉగ్రాణంపల్లిలో 11 మందికి, ఎల్‌కేపీ ఊరులో 4, జక్కిదొనలో 13మందితో పాటు మరికొంత మందిని కలిపి మొత్తం 75 మందికి కళ్లద్దాలను గురువారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కంటి డాక్టర్ వెంకటేశ్వర్, ప్రధానోపాధ్యాయులు యామిని, సంధ్య, మంజుల, రాధాకృష్ణ, జనసేన మండల అధ్యక్షుడు శ్రీనివాస్, బీజేపీ నేత వాసు, మాజీ పీహెచ్‌సీ ఛైర్మన్ పరమేశ్వర్‌రెడ్డి, సీహెచ్‌వో గోవిందయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఈడ్ ఫలితాల్లో ప్రతిభ



బీఎడ్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన సూర్యభాను, ఫర్హానా, సమీల్

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుంబకుప్పం క్రాస్ వద్ద ఉన్న శ్రీవెంకటేశ్వరా బీఎడ్ కళాశాల విద్యార్థులు బీఎడ్ సెమిస్టర్ ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల డైరెక్టర్ భాస్కర రెడ్డి తెలిపారు. 2023-24 విద్యాసంవత్సరానికి ఎస్వీయూ నిర్వహించిన బీఎడ్ కోర్సుల్లో తమ కళాశాలకు చెందిన సూర్య భాను, ఫర్హానా, సమీల్ ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ గోపినాథ్, ఉపాధ్యాయులు చిన్నబాబు, షేక్ ఖాదిర్ అభినందించారు.

ముత్తిరేవులను అభివృద్ధి చేస్తా : ఎమ్మెల్యే మురళి

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్తిరేవులను అన్నివిధాలా అభివృద్ధి చేస్తానని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. ముత్తిరేవుల గ్రామ సచివాలయం వద్దకు గురువారం ఆయన స్థానిక నాయకులతో కలసి వెళ్లారు. ఈ సందర్భంగా ప్రజలనుంచి వినతులను స్వీకరించారు. ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఆయన నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. డ్రైనేజీ సమస్య, శ్మశానానికి స్థలం కేటాయింపు, దారి, ఓవర్ హెడ్ ట్యాంకు, సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. నగరపాలక సంస్థ మేయర్ అముద, పూతలపట్టు మండల టీడీపీ కన్వీనర్ దొరబాబు చౌదరి, అధికారి ప్రతినిధి గంగారపు గోపి, నాయకులు చంద్రమౌళి, ఎల్బీఐ అధినేత లోకేష్ రెడ్డి, నగరపాలక కమిషనర్ నరసింహ ప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్, ఇంజనీర్ వెంకటేష్, ఆరోగ్యశాఖ అధికారి లోకేష్, నగరపాలక సంస్థ సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

అడవిపందుల దాడిలో దుప్పి మృతి



చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): అడవి పందుల దాడిలో దుప్పి మృతిచెందినట్లు తూర్పు ఎఫ్ఆర్వో థామస్ తెలిపారు. గురువారం స్థానిక రెడ్డిగుంట సమీపంలో అటవీ ప్రాంతం నుంచి దుప్పి దాహార్తికోసం బయటకు వచ్చినట్లు తెలుస్తోందన్నారు. దారి తప్పిన దుప్పి పీవీకేఎన్ డిగ్రీ కళాశాల సమీపంలోని అటవీ ప్రాంతంలోకి రాగా, అడవి పందుల దాడిలో మృతిచెందినట్లు ఆయన చెప్పారు. సమాచారం అందగానే ఘటనాస్థలానికి చేరుకొని దుప్పి కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం ఖననం చేసినట్లు ఆయన తెలిపారు.

వైసీపీ ధర్నాకు అనుమతి లేదు: డీఎస్పీ

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పాత బస్టాండు వద్ద శుక్రవారం వైసీపీ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన ధర్నాకు అనుమతి లేదని చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాతబస్టాండు ప్రాంతంలో నిర్మించతలపెట్టిన షాపింగ్ మాల్‌కు వ్యతిరేకంగా కొంతమంది వ్యక్తులు, రాజకీయపార్టీ నాయకులు ధర్నా చేయనున్నట్లు సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వార్తకు సంబంధించి పోలీసులు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. దీనికి విరుద్ధంగా ఎవరైనా ధర్నా చేపట్టినా, పాల్గొన్నా, సహకరించిన వారిపై చట్టపరమైన కేసు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

ప్రత్యేక ప్రతిభ కల్గిన బాలలకు వైద్య, న్యాయ సేవలు అందిస్తాం

తవణంపల్లె, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ప్రతిభ (అవసరాలు) కలిగిన బాలలు న్యాయ సేవ అధికార సంస్థను సంప్రదిస్తే వైద్య, న్యాయ సేవలు అందిస్తామని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఎం.ఎస్ భారతి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని తవణంపల్లెలో జిల్లా కార్యదర్శి భారతి పోలీసు సిబ్బంది, వైద్య సిబ్బందితో కలిసి బాలల హక్కులు, పరిరక్షణపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టుకతో వచ్చే లోపాల వల్ల వికలాంగులైన బాలలను గుర్తించి వారికి సరైన వైద్య, న్యాయ సేవలు అందించేందుకే ఈ కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. ప్రత్యేక ప్రతిభ కలిగిన పిల్లలను గుర్తించే బృందంలో న్యాయవాది, పారా లీగల్ కార్యకర్త, ఏఎన్ఎం, ఆశ కార్యకర్త, వైద్యాధికారి ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్య సిబ్బంది, ఎస్ఐ చిరంజీవి పాల్గొన్నారు.

మసీదుల్లో నమాజ్ ఏర్పాట్లకు ఆదేశం

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రానున్న రంజాన్ మాస ఉపవాసాల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అన్ని మసీదుల్లో ముస్లిం సోదరులు నమాజ్ నిర్వహించడానికి అధికారులు మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వం ఆదేశించినట్లు నగర ముస్లిం మత పెద్దలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28 నుంచి మార్చి 30 వరకు ప్రతిరోజు నిర్వహించే రంజాన్ ఉపవాస దీక్షల నిర్వహణకు మసీదుల్లో విద్యుత్, తాగునీరు, శానిటేషన్ తదితర చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు వారు పేర్కొన్నారు.

అమ్మవార్లకు రూ.2.51 లక్షల ఆదాయం



హుండీలో నగదును లెక్కిస్తున్న ఆలయ నిర్వాహకులు

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నగరపాలక పరిధిలోని 75 దొడ్డిపల్లె సప్తకన్నికల ఆలయ హుండీ ద్వారా అమ్మవార్లకు రూ.2,51,383లు ఆదాయం వచ్చింది. గురువారం ఆలయంలో అమ్మవార్ల హుండీని దేవదాయశాఖ అధికారుల సమక్షంలో నిర్వాహకులు లెక్కించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో తిమ్మారెడ్డి, సూపర్‌వైజర్ గీత, నిర్వాహకులు నళిని తిరుకుమరన్, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

బీసీ విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): బీసీ విద్యార్థుల సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఉప్పర నాగేశ్వరరావు అన్నారు. గురువారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లా ఓబీసీ సంఘం అధ్యక్షుడిగా పుంగనూరుకు చెందిన వెంకట్ యాదవ్‌ను నియమించినట్లు చెప్పారు. రాష్ట్రంలో బీసీ వసతి గృహాల్లో అనేక సమస్యలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వం ప్రతి విద్యార్థికి రోజుకు మెస్ చార్జీలు కేవలం రూ.52తో సరిపెట్టడం బాధాకరమని అన్నారు. నాణ్యత లేని, చాలీచాలని భోజనాలతో విద్యార్థులు పస్తులతో గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వసతి గృహాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాయలసీమ అధ్యక్షుడు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీరుకు అభినందనలు



వలంటీర్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

వెదురుకుప్పం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్ రవికుమార్‌ను గురువారం ప్రిన్సిపాల్ డాక్టర్ సీతావిజయలురెడ్డి, ఎన్ఎస్ఎస్ పీవో ధనంజయులురెడ్డి అభినందించారు. నర్సాపూర్‌లో వారం రోజులపాటు జరిగిన ఎన్ఎస్ఎస్ జాతీయ సమైక్యత శిబిరం-2025 కార్యక్రమంలో వలంటీర్ పాల్గొన్నారని ప్రిన్సిపాల్ తెలిపారు.

జేఈఈ ఫలితాల్లో పీఈఎస్ విద్యార్థికి ప్రథమ ర్యాంకు



అరవింద్‌ను సన్మానిస్తున్న పీఈఎస్ పాఠశాల ప్రిన్సిపాల్, యాజమాన్యం

యాదమరి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ 2025 ఫేజ్-1 పరీక్షలకు సంబంధించి ఇటీవల విడుదలైన ఫలితాల్లో పీఈఎస్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. బుధవారం ప్రకటించిన ఫలితాల్లో విద్యార్థి టి.అరవింద్ 98.88 శాతంతో చిత్తూరు జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంకు, జె.వినయ్ 92.37 శాతంతో పాఠశాల స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పీఈఎస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎం.ఆర్.దొరస్వామి, పీఈఎస్ పబ్లిక్ పాఠశాల ప్రిన్సిపాల్ వై.వి.కృష్ణబాబు, అధ్యాపక బృందం అభినందించారు.



విజయమాంబాపురం నూతన కాలనీలో పొదల చాటున ఇళ్లు - అసంపూర్తిగా ఇళ్ల నిర్మాణం - అధ్వానంగా వీధి

విజయమాంబాపురం నూతన కాలనీలో

సమస్యల కొలువు

- తాగునీటి వసతి అంతంత మాత్రమే
- అధ్వానంగా వీధులు
- ముళ్ల పొదల మధ్య కాలనీ

వెదురుకుప్పం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం విజయమాంబాపురం నూతన కాలనీలో సమస్యలు కొలువుదీరాయి. కాలనీలో కనీస వసతులు కూడా కల్పించలేదు. వీధులు అధ్వానంగా ఉన్నాయి. ఈ కాలనీలో 33 ప్లాట్‌లను ప్రభుత్వం కేటాయించింది. ఇందులో 26 గృహాలను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిలో సుమారు 14 ఇళ్లు మాత్రమే నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగతా ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. వైసీపీ పాలన నుంచి ఇప్పటికీ పునాది దశ దాటని ఇళ్లు ఉన్నాయి. పునాదికి గోతులు తీసి వదిలేసిన ఇంటి నిర్మాణ పనులు అక్కడ దర్శనమిస్తున్నాయి. తాగునీటి వసతి అంతంత మాత్రంగా కల్పించారు. తాగునీటి కొళాయిలకు బిరడాలు కూడా లేవు. వీధులను మట్టితో చదును చేయకపోవడం వల్ల అధ్వానంగా ఉన్నాయి. సిమెంటు రోడ్డు నిర్మాణాలు చేపట్టలేదు. కాలనీలో ముళ్ల పొదలు ఏపుగా పెరిగిపోయి విషపురుగుల బెడద కూడా ఉంది. పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టడం లేదని తెలుస్తోంది. ఇప్పటికైనా కాలనీలో సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



పునాదులకే పరిమితమైన ఇళ్లు

ఫోర్జరీ పత్రాల తయారీదారుడి అరెస్టు



ఫోర్జరీ పత్రాల తయారీదారుడిని అరెస్టు చూపిస్తున్న ఎస్ఐ వెంకటసుబ్బయ్య

వెదురుకుప్పం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమికి ఫోర్జరీ పత్రాలను తయారీ చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు వెదురుకుప్పం ఎస్ఐ వెంకటసుబ్బయ్య గురువారం తెలిపారు. వెదురుకుప్పం పోలీసుస్టేషన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... వెదురుకుప్పం మండలం దిగువపల్లాలు(దాసరికాలనీ) గ్రామానికి చెందిన బి.ఇరవమరెడ్డి కుమారుడు బి.నారాయణరెడ్డి ఆళ్లమడుగు రెవెన్యూ లెక్కదాఖలా సర్వే నంబరు 165లో 280 చదరపు గజాల స్థలాన్ని తన పేరుపై అనుభవ హక్కు పత్రాన్ని తయారు చేసుకుని, దాన్ని తన భార్య నాగమ్మ పేరుతో కార్వేటినగరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించాడు. ఈ సంఘటనపై ఆళ్లమడుగు వీఆర్వో హేమాద్రిరెడ్డి తన సంతకాలు ఫోర్జరీ చేశారని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైందన్నారు. ఈ కేసులో నిందితుడైన నారాయణరెడ్డిని అరెస్టు చేసి, రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ వివరించారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుంబపాళ్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను యూటీఎఫ్ మండల అధ్యక్షుడు మొగిలయ్య గురువారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని కోరారు. యూటీఎఫ్ నాయకులను జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ అభినందించారు. హెచ్ఎం చిట్టెమ్మ, ఉపాధ్యాయులు గంగాభవానీ,బాబు, గిరిధర్‌నాయుడు, అమరేంద్ర, రీటా, దామోదర్, నజ్మా పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు సక్రమంగా ఇవ్వడం లేదు

- 41వ రేషన్ షాపు డీలర్‌పై లబ్ధిదారుల ఫిర్యాదు



రికార్డులు పరిశీలిస్తున్న సీఎస్‌డీటీ శ్యామ్‌ప్రసాద్

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): స్థానిక వినాయకపురంలోని 41వ రేషన్ షాపు డీలర్ నిత్యావసర సరుకులు సక్రమంగా ఇవ్వడం లేదని గురువారం షాపు వద్ద లబ్ధిదారులు ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ 25 కేజీలు ఇవ్వాలంటే 10 కేజీలు ఇచ్చి మిగిలిన వాటికి డబ్బులు తీసుకోవాలని డీలర్ ఇబ్బంది పెడుతున్నాడని ఆరోపించారు. కాస్త ఆలస్యమైతే ఆ బియ్యం కూడా ఇవ్వడం లేదని వాపోయారు. దీనిపై చిత్తూరు తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. దీంతో డీఎస్‌వో కార్యాలయ సీఎస్‌డీటీ శ్యామ్‌ప్రసాద్ గురువారం విచారణ చేసి, రికార్డులను స్వాధీనం చేసుకున్నారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరించండి

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో భాగంగా నిర్వహించిన గ్రామసభల్లో వచ్చిన అర్జీలను, భూ రీసర్వేలను ఎంత వరకు పరిష్కరించారని పలమనేరు ఆర్డీవో భవానీ రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామసభల ద్వారా వచ్చిన ఫిర్యాదులను ఆలస్యం చేయకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలను అందించాలని సూచించారు. భూ రీసర్వేల సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆమె తెలిపారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తహశీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్, ఆర్ఐ మధుసూదన్, సర్వేయర్ లావణ్య, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల వద్ద అధిక వసూళ్లు ఆపాలి

నగరి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికుల వద్ద గుత్త హక్కుల పేరిట అధిక వసూళ్లు ఆపాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. నగరి మున్సిపాలిటీ కార్యాలయం వద్ద గురువారం ఆటోవర్కర్స్ యూనియన్ నాయకులు శేఖర్, ఏసు, నందకుమార్‌ల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడా రోజుకు రూ.30 చొప్పున ఆటో కార్మికుల వద్ద వసూలు చేయలేదని.. ఒక్క నగరిలో మాత్రం వసూలు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం నుంచి ఏదైనా జీవో ఉంటే దాని ప్రకారమే వసూలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏలన్, బాషా, గోపాల్, ఆజర్, ఆర్ముగం, రాజశేఖర్, దయానిధి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణ బాధ్యత కార్యదర్శులదే

వెదురుకుప్పం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ బాధ్యత గ్రామ కార్యదర్శులదే అని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) సుధాకరరావు హెచ్చరించారు. గురువారం కార్వేటినగరంలో గ్రామ కార్యదర్శులు, ఈవోపీఆర్డీ, ఎంపీడీవోలతో సమావేశం జరిగింది. డీపీవో మాట్లాడుతూ గ్రామాల్లో తడి, పొడి చెత్తను సేకరించి సంపదను సృష్టించడానికి కృషి చేయాలన్నారు. వెదురుకుప్పం మండలంలోని మాంబేడు, పచ్చికాపల్లం గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉందని ఆయా కార్యదర్శులపై మండిపడ్డారు. అలాగే కార్వేటినగరంలో కార్యదర్శులతో కలసి చెత్త సేకరణ పనులు చేపట్టారు.

పలువురికి రోజా పరామర్శ

విజయపురం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో మాజీ మంత్రి ఆర్కే రోజా గురువారం పలు కుటుంబాలను పరామర్శించారు. విజయపురం మండలం కోసలనగరంలో ఇటీవల మృతి చెందిన మునిబాషా, సుబ్బరామరాజు కుటుంబాలను, మహారాజపురంలో అనారోగ్యంతో ఉన్న పరంధామ యాదవ్‌ను పరామర్శించారు. నింద్ర మండలం ఇరుగువాయిలో ఇటీవల వివాహమైన పంచాక్షరి కుటుంబంలో నూతన వధూవరులను, నింద్రలో చార్లీని, బీసీ కాలనీలో అయ్యప్పరెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. నగరి రూరల్ మండలం వేలావడిలో రాజేష్‌ను, హరిజనవాడలో ఆదిలక్ష్మి కుటుంబాన్ని పరామర్శించారు. విజయపురం, నింద్ర, నగరి వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ



సైకిళ్లు అందజేస్తున్న ఎస్బీఐ ఆర్ఎం సురేష్ బాబు, సిబ్బంది

యాదమరి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు చిత్తూరు ఎస్బీఐ సిబ్బంది పది సైకిళ్లను ఉచితంగా అందజేశారు. గురువారం ఉదయం చిత్తూరు ఎస్బీఐ మెయిన్ బ్రాంచ్ ఆర్ఎం సురేష్ బాబు, చీఫ్ మేనేజర్ రాజేష్, శిరీష, సిబ్బంది తమ సొంత నిధులతో పేద విద్యార్థినుల ఉపయోగార్థం సైకిళ్లను వితరణ చేశారు. ఆర్ఎం మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి పాఠశాలకు వస్తున్న విద్యార్థులు సమయానికి స్కూల్‌కి వెళ్లి బాగా చదివి రాణించాలనే ఉద్దేశంతో వారికి చేయూత అందిస్తున్నామన్నారు. హెచ్ఎం గిరిరాజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): నగరపాలక పరిధిలో చిత్తూరు-వేలూరు రోడ్డులో బీసీ భవన్ నుంచి మ్యాంగోభవన్ వరకు రూ.కోటి వ్యయంతో జరుగుతున్న రోడ్డు నిర్మాణపు పనులను కమిషనర్ నరసింహ ప్రసాద్ గురువారం పరిశీలించారు. పీవీకేఎన్ డిగ్రీ కళాశాల వద్ద జరుగుతున్న బీటీ రోడ్డు పనులను పరిశీలించి అధికారులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. రోడ్డు నిర్మాణంలో మార్గదర్శకాలను పాటించాలని, నాణ్యతా ప్రమాణాలు నిర్దేశించిన మేరకు ఉండాలని స్పష్టం చేశారు. పనులు సకాలంలో పూర్తి చేయాలని కమిషనర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఏఈ లోకేష్ ఉన్నారు. అంతకుముందు కమిషనర్ నగరంలో పర్యటించి పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

రైతు రిజిస్ట్రేషన్ కేంద్రాల వద్ద రద్దీ



రైతుసేవా కేంద్రంలో నమోదు కోసం వేచివున్న రైతులు

యాదమరి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): రైతు విశిష్ట గుర్తింపు కార్డుల నమోదు కోసం సేవా కేంద్రాల్లో రద్దీ నెలకొంది. ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు వ్యవసాయ రంగంలో లభించే అన్ని రకాల సబ్సిడీలకు సంబంధించి ఒక ప్రత్యేక గుర్తింపు కార్డు జారీకి ప్రకటన విడుదల చేశారు. ఈ నేపథ్యంలో మండల పరిధిలోని రైతులు తమ వ్యవసాయ సహాయకుల వద్ద ఫార్మర్ పర్మినెంట్ రిజిస్ట్రేషన్ కోసం సచివాలయాల వద్ద క్యూ కడుతున్నారు.

వైసీపీ ఇన్‌చార్జి కృపాలక్ష్మికి సత్కారం

వెదురుకుప్పం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): వైసీపీ జీడీనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కృపాలక్ష్మిని గురువారం నియోజకవర్గంలో నూతనంగా నియమితులైన ఆ పార్టీ అధ్యక్షులు కలిశారు. ఈ క్రమంలో ఆమెకు శాలువ కప్పి సత్కరించారు. పుష్పగుచ్ఛమిచ్చారు. వైసీపీ మండల అధ్యక్షులు శేఖర్‌రాజు(కార్వేటినగరం), కామసాని పద్మనాభరెడ్డి(వెదురుకుప్పం), కామసాని విజయులురెడ్డి(పెనుమూరు), మణి (ఎస్ఆర్‌పురం), తులసీయాదవ్ (పాలసముద్రం), పూర్ణచంద్రారెడ్డి (జీడీనెల్లూరు) పాల్గొన్నారు.

విదార్థులకు టెస్టు పేపర్ల వితరణ

విజయపురం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగమాంబాపురంలో గురువారం రిటైర్డు ప్రధానోపాధ్యాయులు చంద్రయ్య పదవ తరగతి విద్యార్థులకు ఉపయుక్తంగా యూటీఎఫ్ తయారు చేసిన టెస్టు పేపర్లను వితరణగా అందించారు. ఎస్సీఆర్టీ రూపొందించిన ప్రశ్నల నుంచి తయారు చేసిన పుస్తకం పాఠశాల హెచ్ఎం ఉమాశంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తులతో ఈవో సహపంక్తి భోజనం

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ నిత్యాన్నదాన సత్రంలో గురువారం భక్తులతో కలసి ఈవో పెంచలకిషోర్ సహపంక్తి భోజనం చేశారు. అనంతరం ఆయన భక్తులతో మాట్లాడుతూ భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ భక్తులకు అవసరమైన భోజనాన్ని పెట్టాలని సూచించారు. భోజనాన్ని వృధా కాకుండా చూడాలన్నారు. భోజనం కోసం వచ్చే భక్తులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని సిబ్బందికి సూచించారు.

నేడు దివంగత సీఎం సంజీవయ్య జయంతి

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ దివంగత సీఎం దామోదరం సంజీవయ్య 104వ జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం కలెక్టరేట్‌లోని పాత గ్రీవెన్స్ హాలులో నిర్వహిస్తున్నట్లు సాంఘిక సంక్షేమం, సాధికారిత అధికారి చెన్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, దళిత నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని కోరారు. సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమంగా నిర్ణయించినందున అందరూ తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.